
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 29 ఫిబ్రవరి 2024

ఆంధ్రా ఊటీ.. ఆస్తులు లూటీ

- అభివృద్ధి పట్టని టౌన్‌షిప్ కమిటీ
- పర్యాటకం చూడని హార్సిలీహిల్స్
- ప్రైవేటుకు పెద్దపీట.. ప్రభుత్వరంగం నట్టేట
- హౌస్‌బిల్డింగ్ సొసైటీలో అక్రమాల గోల

మదనపల్లె, ఫిబ్రవరి 28: ప్రముఖ పర్యాటక కేంద్రంగా, ఆంధ్రా ఊటీగా పేరొందిన హార్సిలీహిల్స్‌లో విలువైన ప్రభుత్వ భూములు క్రమంగా లూటీ అవుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం, లీజుకు ఇవ్వడం, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలతో పరాధీనం అవుతున్నాయి. మొన్న సీడీసీఎంఎస్ భవనాలు, నిన్న బీఎస్ఎల్ ఆస్తులు, తాజాగా క్రీడాశిక్షణ కేంద్రం ఇలా ఒక్కొక్కటి లీజులు, అయిన వారికి కట్టబెట్టడాలతో ఖాళీఅవుతున్నాయి. దీంతో హార్సిలీహిల్స్ అసలు స్వరూపం కనుమరుగవుతుండగా, దాని ఉద్దేశం నీరుగారిపోతోంది. హార్సిలీహిల్స్ హౌస్ బిల్డింగ్‌తో మొదలైన అక్రమాలు ప్రైవేటు చొరబాటుతో మరింత పెరిగి, చివరకు ప్రభుత్వ జోక్యంతో భూపందేరం యాత్ర-2తో హార్సిలీహిల్స్ వరకూ చేరింది. పర్యాటక రంగానికి ప్రభుత్వం పైసా ఖర్చు చేయకపోయినా అక్కడున్న విలువైన భూముల అన్యాక్రాంతానికి పాల్పడుతూ ప్రభుత్వ రంగాన్ని పడేస్తూ, ప్రైవేటును పైకి తెస్తోంది. వివిధ రాష్ట్రాల నుంచి ఆహ్లాదానికి, సేద తీరడానికి వస్తున్న పర్యాటకులకు కనీస వసతులు కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ప్రభుత్వ అతిథి గృహాలు, హోటల్‌తో పోలిస్తే ప్రైవేటువే మేలనే స్థాయికి తీసుకొచ్చారు పాలకులు, టౌన్‌షిప్ కమిటీ అధికారులు. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో హార్సిలీహిల్స్‌పై పెట్టిన శ్రద్ధ తర్వాత కనిపించలేదు. కానీ కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత వీటిపై ఉన్నతాధికారులు కాస్త హడావిడి చేసినా తర్వాత వివిధ కారణాలతో మూడు నెలలకే మూన్నాళ్ల ముచ్చటగానే మారిపోయింది.

సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న హార్సిలీహిల్స్ అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం పరిధిలోకి వస్తుంది. కోటావూరు రెవెన్యూ గ్రామంలోని హార్సిలీహిల్స్ కర్ణాటక సరిహద్దులోని కొండలతో లింకై ఉంటుంది. ఇక్కడి కొండపై 103 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములతో పాటు పర్యాటక, అటవీశాఖ, పోలీస్, రెవెన్యూ, హౌస్‌బిల్డింగ్ సొసైటీ, సిరికల్చర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ క్రీడా శిక్షణ కేంద్రం, సీడీసీఎంఎస్, తదితర విభాగాలకు భూములు కేటాయించారు. ఇదిలా ఉండగా 1974లో హార్సిలీహిల్స్ హౌస్‌బిల్డింగ్ సొసైటీ ఏర్పడగా తర్వాత 2001లో రాజకీయ జోక్యం లేకుండా హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ ఏర్పాటు చేశారు. కోటావూరు పంచాయతీ నుంచి విడదీసి టౌన్‌షిప్ పరిధిలోకి తెచ్చారు. పెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఉన్న మదనపల్లె సబ్ కలెక్టర్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. వాటికన్ సిటీ తరహాలో హార్సిలీహిల్స్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే టౌన్‌షిప్ కమిటీ ఏర్పాటైంది. కమిటీ మూడునెలలకోసారి సమావేశమై..అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఇతరత్రా నిర్ణయాలపై కమిటీ ఆమోదం తీసుకోవాలి. కానీ 2014 నుంచి కూడా టౌన్‌షిప్ కమిటీ నామమాత్రంగా మిగిలిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో అప్పటికే ఉన్న హౌస్‌బిల్డింగ్ సొసైటీలో అక్రమాలు, మితిమీరిన రాజకీయజోక్యం, కోర్టు కేసులు ఎక్కువయ్యాయి అలాగే టౌన్‌షిప్ కమిటీ అనుమతి లేకుండానే నిర్మాణాలు, స్థలాల ఆక్రమణ, విద్యుత్ కనెక్షన్ల మంజూరు, తదితరాలు విచ్చలవిడిగా సాగిపోతున్నా పట్టించుకున్న పాపానపోలేదు. మరోవైపు హార్సిలీహిల్స్‌పైకి రోప్‌వే, రిషి వ్యాలీ సమీపంలోని బోర్లు వేసి, రెండో పైపులైన్ ద్వారా నీటిని తీసుకెళ్లాలనే ప్రతిపాదన అమలు కాలేదు. కొండపై వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం శానిటేషన్, విద్యుదీకరణతో పాటు నీటి సరఫరాను మెరుగుపరచాలనే నిర్ణయాలు అటకెక్కాయి.




హార్సిలీహిల్స్‌పై జరుగుతున్న భూఅక్రమాలను పసిగట్టిన ప్రభుత్వం ఇదివరకే హౌస్‌బిల్డింగ్ సొసైటీకి కేటాయించిన 21.60 ఎకరాలను 2005-06లో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. తర్వాత ఇక్కడ భూముల క్రయ, విక్రయాలపై నిషేధం విధించింది. ఈ క్రమంలో అప్పటికే హౌస్‌బిల్డింగ్ సొసైటీలో తొమ్మిది మందికి అయిదు సెంట్ల చొప్పున మొత్తం 45 సెంట్లు పోను మిగిలిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అక్కడ ప్లాట్లు పొందిన తొమ్మిది మందిలో సినీనటులు శరత్‌బాబు, జమున, తదితరులు నిర్మాణాలు చేపట్టారు. ఇదిలా ఉండగా, తర్వాత కీలకంగా మారిన హౌస్‌బిల్డింగ్ సొసైటీలో తమకు అనుకూలమైన, తన అనుయాయులను కొత్తగా సభ్యులుగా చేర్చుకోవడం, ఎన్నికల్లో చైర్మన్ గిరిని దక్కించుకోవడం, తర్వాత వారికి ప్లాట్లు కేటాయించడం షరా మామూలైంది. ఇలా కొన్నేళ్లుగా రెండు వర్గాల ఆధిపత్యంలోనే హౌస్‌బిల్డింగ్ సొసైటీ నడుస్తోంది. ఈ క్రమంలో అటు ప్రభుత్వం ఓపక్క, సొసైటీలోనే మరోవర్గం అక్కడ జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఓపక్క విచారణ జరుగుతుండగా, మరోపక్క తమకు కేటాయించిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంపై సొసైటీ కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో అటు సొసైటీ వ్యవహారంలోనూ, ఇటు భూస్వాధీనంలోనూ రెండు అంశాలపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. ఒకప్పుడు పెద్ద పెద్ద భూస్వాములు, రాజకీయ నేతలు, సినీరంగ ప్రముఖులు, ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులకు ఇక్కడి హౌస్‌బిల్డింగ్ సొసైటీలో సభ్యత్వంతో పాటు ప్లాటు ఉండేది. తర్వాత రెండు వర్గాలు చైర్మన్ గిరి కోసం పోటీ పడటం, అయిన వారికి సొసైటీలో చోటు కల్పించడం, వారి నుంచి భారీగా పెద్ద మొత్తంలో సొమ్ములు తీసుకుని ప్లాటు కేటాయించడం మొదలు పెట్టారు. ఇలా ఒకప్పుడు వంద నుంచి 150 మంది ఉన్న సభ్యులు ప్రస్తుతం 750 పైబడి ఉన్నట్లు చెబుతున్నారు.


చిత్తూరు నుంచి విడిపోయి అన్నమయ్య జిల్లా పరిధిలోకి వచ్చిన హార్సిలీహిల్స్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని జిల్లా మొదటి కలెక్టర్ పీఎస్ గిరీషా, మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళిలు హార్సిలీహిల్స్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో మూడుసార్లు మీటింగులు పెట్టి హడావిడి చేశారు. హార్సిలీహిల్స్ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నట్లు ప్రకటించారు కూడా. ఇందులో భాగంగా అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం, అనధికార నివాసాలు, భవనాలు తొలగించడంతో పాటు వాటికి నీటి సరఫరా, విద్యుత్తు సరఫరా నిలిపేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓ విధంగా చెప్పాలంటే హార్సిలీహిల్స్‌పై అనుబంధంగా ఉన్న సంస్థలు, వారికి కేటాయించిన భూములు, స్థలాలు, భవనాలు, వాటి స్థితిగతులు, వినియోగంపై ఆరా తీశారు. ఇందులో భాగంగా బీఎస్ఎన్ఎల్ సంస్థకు కేటాయించిన స్థలం, భవనాలను రైల్వే విభాగానికి లీజుకు ఇచ్చినట్లు గుర్తించారు. ఈ క్రమంలో టౌన్‌షిప్ కమిటీ అనుమతి లేకుండా అక్రమంగా ఇచ్చిన లీజు చెల్లదంటూ స్వాధీనం చేసుకున్నారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులు అడ్డుకున్నారు. తర్వాత ఏమైందో ఏమో కానీ నాలుగో సమావేశానికే అంతా చల్లబడిపోయారు. స్వాధీనం చేసుకున్న స్థలం, భవనాలను తర్వాత అధికార పార్టీకి చెందిన ఓ నేతకు 30 ఏళ్ల లీజుకు కట్టబెట్టారు. అక్కడ ఓ పెద్ద రెస్టారెంట్, రెసిడెన్సీ వెలసిపోయాయి. వీటిని ప్రభుత్వ రంగంలోని టూరిజం శాఖకు కేటాయించకుండా అధికార పార్టీ నేతకు లీజుకు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ప్రభుత్వ ఆస్తిని ప్రైవేటుకు కట్టబెట్టే క్రమంలో పత్రికల్లో బహిరంగ ప్రకటన కానీ, టెండర్ కానీ లేకుండా ఇవ్వడం వెనుక భారీగా సొమ్ములు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. యాత్ర-2 సినిమాతో వీరుడు, సూరుడని కీర్తించిన సినీ డైరెక్టర్ మహి వి.రాఘవ సంస్థకు కొండపై సర్వే నెంబర్-371-2లో సుమారు రూ.20 కోట్ల విలువ చేసే రెండెకరాల భూమిని కట్టబెట్టడానికి ప్రభుత్వం సిద్ధమైంది. సిరికల్చర్ భవనాలతో పాటు మరోచోట 21 ఎకరాలను ఒబెరాయ్ సంస్థకు అప్పగించారు. ఇందులో ఫైవ్‌స్టార్ హోటల్‌తో పాటు విల్లాలు నిర్మిస్తామని ఆ సంస్థ తీసుకున్నా ఎలాంటి పనులూ చేపట్టలేదు. అలాగే సీడీసీఎంఎస్ భవనాలను ఓ ప్రైవేటు వ్యక్తికి లీజుకు కట్టబెట్టగా, ఆయన అతిథి గృహాలుగా నడుపుతున్నారు. ఇలా హిల్స్‌పై విలువైన భూములు పరులపాలవుతున్నాయి.

హార్సిలీహిల్స్‌లో తాజా పరిస్థితులను పరిశీలిస్తే అటు ప్రభుత్వ భూములు, భవనాలను ప్రైవేటుకు కట్టబెట్టడం ద్వారా పరోక్షంగా ప్రైవేటును ప్రోత్సహిస్తున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి. దీంతో హిల్స్‌పై పర్యాటకరంగంలోని అతిథిగృహాలు నిర్వీర్యం అవుతుండగా ప్రైవేటు వ్యాపారం కళకళలాడుతోంది. ఇలా ఇక్కడ ప్రైవేటును పెంచడం ద్వారా ప్రభుత్వ వ్యవస్థల్ని చంపేశారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. తాజాగా నిర్మాణంలో ఉన్న రెవెన్యూ అతిథి గృహం కూడా తమకు కావాల్సిన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత టూరిజం ఎండీ, జిల్లా అధికారులు, ఇంజనీర్లు చాలాసార్లు హిల్స్‌కు వచ్చారు. రూ.6 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు రచించినా ఇప్పటి వరకూ రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఇక్కడ టూరిజం ఆధ్వర్యంలో గవర్నర్ బంగ్లా, యాత్రి నివాస్, బి.బ్లాక్, విండ్‌పాల్, కాటేజీలు, తదితర మొత్తం 60 అతిథి గృహాలు ఉన్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తే ముందుగా ప్రైవేటులోని ఓ హోటల్ మాత్రమే కనిపించడం కొసమెరుపు. అలాగే టూరిజంలో ఏటా రూ.5 కోట్లు ఆదాయం వస్తుండగా, ఆ స్థాయిలో అభివృద్ధికి నిధులు వెచ్చించడం లేదు.


యాత్ర-2 డైరెక్టర్ మహి స్టూడియోకు కేటాయించిన భూమి


బీఎస్ఎన్ఎల్ నుంచి స్వాధీనం చేసుకున్న స్థలంలో వైసీపీ నేత నిర్మించిన హోటల్


సీడీసీఎంఎస్ భవనాల్లో నిర్వహిస్తున్న అతిథి గృహ సముదాయం

అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



ముగిసిన నలవీరగంగాభవానీ జాతర

- ఎద్దుల పరుష ప్రారంభం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 28: మండలంలోని సీటీఎం నలవీర గంగాభవానీ జాతర దోపు ఉత్సవంతో మంగళవారం ముగిసింది. ఆలయంలో మూడు రోజులపాటు సీటీఎం జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో వేలాదిగా భక్తులు తరలివచ్చి గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో టెంకాయపట్ల బండ్లు ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చాయి. మంగళవారం ఆలయానికి సీటీఎం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనందపార్థసారథి, వెలుగుచంద్ర, పారపట్ల సురేంద్రరెడ్డి, వీరప్రతాప్‌లు గొప్ప ఎద్దుల పరుషను ప్రారంభించారు. ఈ ఎద్దుల పరుషకు వివిధ జిల్లాల నుంచి పలు రకాల జాతుల పశువులను రైతులు తీసుకొచ్చారు. పలు ప్రాంతాల నుంచి దళారీ వ్యాపారులు ఎద్దుల పరుషలోకి చేరుకున్నారు. ఇందులో అలికారి, నాటీ, సన్నకారు, ఒంగోలు, పుంగనూరు జాతుల పశువులు పరుషలో ఉన్నాయి. ఒంగోలు గిత్తలు ఆరు లక్షల రూపాయలు ధర పలికాయి. సీటీఎం అంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రైతులకు అన్నదానం చేశారు.


ఎద్దుల పరుషలో రూ.6 లక్షలు పలికిన ఒంగోలు గిత్తలు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 2.05 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.41.26 కోట్లు జమ
- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 28: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. జిల్లాలో 2,05,806 మంది రైతుల ఖాతాల్లో రూ.41.26 కోట్లు వైఎస్ఆర్ రైతు భరోసా జమ చేసినట్లు తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రైతులకు, సొంత భూమి లేని కౌలు రైతులకు వైఎస్‌ఆర్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయంతో పాటు రబీ 2021-22, ఖరీఫ్ 2022కు సంబంధించి వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ మొత్తాన్ని రైతుల ఖాతాలకు బదిలీ చేశారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జాయింట్ కలెక్టర్ 7.63 కోట్ల రూపాయల మెగా చెక్కును రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించిన ప్రభుత్వం వైఎస్‌ఆర్ రైతు భరోసా-పీఎం కిసాన్ సాయాన్ని అందించిందని తెలిపారు. కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


రైతులకు మెగా చెక్కు అందచేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

టీడీపీ అధికారంలోకి వస్తే..
బీసీలకే జడ్పీ చైర్మన్ పదవి

- జయహో బీసీ సభలో టీడీపీ నాయకులు
- సభ విజయవంతం
- భారీగా హాజరైన బీసీలు

రాయచోటి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తర్వాత జరిగే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీసీ కులానికి చెందిన వ్యక్తులనే జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంలో కూర్చోపెడతామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాయచోటిలో బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో జయహో బీసీ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన టీడీపీ రాజంపేట పార్లమెంటు అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం బీసీలకు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పదవిని ఇవ్వాలని, ఈ మేరకు ఈ జయహో బీసీ సభలో తీర్మానం చేసి పార్టీ అధిష్టానానికి పంపించాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు వైస్ చైర్మన్ పదవే కాదు.. జిల్లా పరిషత్ చైర్మన్ పదవినే ఇవ్వాలని అధిష్టానానికి తీర్మానం పంపిద్దామని పేర్కొన్నారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని ఈసారి ఎన్నికల్లో బీసీ కులాల ప్రజలందరూ సమిష్టిగా చంద్రబాబును గెలిపించాలని కోరారు. బీసీలంటే చంద్రబాబుకు ఎంతో నమ్మకం ఉందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత బీసీలందరిపైనా ఉందన్నారు. టీడీపీ, జనసేన పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం బీసీలు కృషి చేయాలని, అర్హులైన బీసీలకు పదవులు ఇప్పించడం తమ బాధ్యతని అన్నారు. మళ్లీ బీసీలను మోసం చేసేందుకు మాయమాటలతో జగన్ ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. ఒక కార్యాలయం అంటూ లేకుండా కనీసం కుర్చీ లేకుండా అధికారాలు లేని పదవులను బీసీలకు కట్టబెట్టిన జగన్ తానేదో బీసీలకు మేలు చేసినట్లు చెప్పుకుంటున్నాడని విమర్శించారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఊపిరి బీసీ కులాలే అన్నారు. తెలుగుదేశం పార్టీలో ముఖ్యమైన నాయకులు అంటే వెంటనే అచెన్నాయుడు, యనముల రామకృష్ణుడు, కొల్లు రవీంద్రతో పాటు అనేక మంది బీసీ నాయకులు గుర్తుకు వస్తారన్నారు. అదే వైసీపీలో విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి వంటి వాళ్లు గుర్తుకు వస్తారన్నారు. వైసీపీలో బీసీ కులాలకు సరైన ప్రాధాన్యత లేదన్నారు. 2019 ఎన్నికల్లో మాయమాటలతో బీసీల ఓట్లు వేయించుకుని, తర్వాత వారిని మోసం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు మా బీసీ, మా ఎస్సీ అంటూ మభ్యపెట్టేందుకు చూస్తున్నాడని విమర్శించారు. బీసీల జీవితాల్లో వెలుగును నింపే పార్టీ తెలుగుదేశం మాత్రమేనని, అందుకు టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత కూడా బీసీలపైనే ఉందన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీలపైన అక్రమ కేసులు బనాయించి దాడులు చేసి వేధించిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తామని తెలిపారు.

రాజంపేట పార్లమెంటు టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ తన అభ్యర్థిత్వాన్ని మంగళవారం చంద్రబాబునాయుడు ఖరారు చేసి వెంటనే ప్రచారం కూడా చేసుకోమని చెప్పారని, వెంటనే బీసీలతో సమావేశం ఏర్పాటు చేయడం శుభసూచకమన్నారు. తన తండ్రి పాలకొండ్రాయుడుకు కూడా 40 సంవత్సరాలుగా బీసీలే అండగా ఉంటూ వచ్చారు. తనను రాజంపేట పార్లమెంటుకు పోటీ చేయమనే ప్రతిపాదన కొందరు నా వద్దకు తెచ్చినపుడు వారం రోజులు ఆలోచించుకోవడానికి సమయం అడిగాను. నేను ఎవరిపైన పోటీ చేయబోతున్నానో..? వాళ్ల ఆర్థిక పరిస్థితి చూడు వాళ్ళను ఎదుర్కోవడం కష్టమని నాతో కొందరు అన్నారు. అయితే వాళ్ల దగ్గర ఎంత డబ్బు ఉన్నా.. నా వెనుక బీసీలు ఉన్నారనే నమ్మకంతో పోటీ చేయడానికి సిద్ధపడ్డానని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీసీ సోదరులను చూస్తుంటే రానున్న ఎన్నికల్లో కచ్చితంగా రాజంపేట పార్లమెంటు స్థానంలో గెలుపు సాధిస్తామనే నమ్మకం కలుగుతోందనే ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు లేని సమయంలోనే సంబేపల్లె మండలానికి చెందిన మా గురువు కామిని ఈశ్వరయ్య అనే ఉపాధ్యాయుడిని జడ్పీటీసీగా గెలిపించి కడప జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకి దని తెలిపారు.

రాయచోటి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి బీసీలు పట్టుకొమ్మలని, అలాంటి బీసీలపైన వైసీపీ ప్రభుత్వం హత్యాయత్నాలు చేయడమే కాకుండా అక్రమ కేసులు బనాయించి, ఎన్నో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు టీడీపీ అండగా నిలిచిందని తెలిపారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబునాయుడును గెలిపించుకుంటే బీసీలకు న్యాయం జరగడమే కాకుండా రాజకీయంగా కూడా అవకాశాలు వస్తాయన్నారు. బీసీలందరూ ఒకతాటిపైకి వచ్చి రాజంపేట పార్లమెంటు అభ్యర్థితో పాటు తనను, మిగిలిన ఎమ్మెల్యే అభ్యర్థులను కూడా గెలిపించాలని కోరారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గత కొన్ని నెలల క్రితం బీసీ సాధికార యాత్ర పేరుతో యాత్రలు చేసిందని, ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న బీసీ వర్గాలకు చెందిన ఏ మంత్రికైనా పూర్తి స్థాయి స్వేచ్ఛ ఉందా? అని ప్రశ్నించారు. ప్రపంచంలో విజనరీ ఉన్న నాయకుడు ఎవరంటే.. అందరూ చంద్రబాబు పేరు చెబుతారన్నారు. అందరూ కలిసి చంద్రబాబును రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

భారీగా జనం హాజరు

జయహో బీసీ ముగింపు కార్యక్రమానికి జిల్లాలోని నియోజకవర్గాల నుంచి భారీగా బీసీలు హాజరయ్యారు. రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎన్ కాలనీలోని ఆయన కార్యాలయం నుంచి బ్యాండు సెట్, బాణా సంచా పేలుస్తూ.. భారీ ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు బీసీ కులాలకు కులవృత్తులకు చెందిన కురబలు గొర్లను, కుమ్మరులు కుండలు, వడ్డెరలు సుత్తిని, మత్స్యకారులు చేపల వలలు, చేనేత కార్మికులు చేనేత వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు దొరస్వామినాయుడు, మోడం సిద్ధప్ప, త్యాగరాజు, జనార్ధన్, జ్ఞానమూర్తి, కమతం నాగరాజు, దుర్గాప్రసాద్, వేణుగోపాల్, మాజీ ఎంపీపీ కాంతారావు, పురం రామ్మూర్తి, వాసునూరి చంద్రశేఖర్‌తో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయిలో పదవుల్లో ఉన్న పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.


బీసీ కులవృత్తుల వారికి పనిముట్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, సుగవాసి బాలసుబ్రమణ్యం, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, దాసరిపల్లె జయచంద్రారెడ్డి.. సమావేశంలో పాల్గొన్న బీసీలు

అనారోగ్యంతో విద్యార్థిని ఆత్మహత్య

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 28 : అనారోగ్య కారణాల వల్ల మనస్థాపానికి గురై గురు మౌనిక (19) అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలోని బలిజకోట వీధికి చెందిన గురుమౌనిక తన తండ్రి చనిపోవడంతో మేనత్త వెంకటలక్షుమ్మ వద్ద ఉంటూ విద్యాభ్యాసం చేసేదని, ఇటీవల ఆ విద్యార్థినికి ఫిట్స్ రావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుందని, ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ సంఘటనాస్థలానికి వెళ్లి వివరాలు ఆరా తీశామన్నారు. అనారోగ్య కారణాల వల్లనే ఆ విద్యార్థిని మృతి చెందినట్లు మేనత్త వెంకటలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతి చెందిన విద్యార్థిని పోరుమామిళ్ల ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోందని తెలిసింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్)

ముద్దనూరు ఫిబ్రవరి28: మండల పరిధి కడప,తాడిపత్రి హైవే లోని కొత్తపల్లె గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మృతునికి దాదాపు 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ముద్దనూరు పోలీసులను సంప్రదించాలని సీఐ తెలిపారు.

టిప్పరు ఢీకొని బాలికకు గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ చిన్నారి

వల్లూరు, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని గాలివారిపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు... గాలివారిపల్లెకు చెందిన సునీల్, వెంకటసుబ్బమ్మ దంపతుల కూతురు లిఖిత (3) రోడ్డు దాటుతుండగా కడప వైపు వెళుతున్న టిప్పరు ఢీకొంది. ఆమె ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో కడప రిమ్స్‌కు, అనంతరం వేలూరుకు తీసుకెళ్లినట్లు సమాచారం. ఎస్‌ఐ వెంకటరమణ సంఘటనాస్థలాన్ని పరిశీలించి ఆరా తీశారు. టిప్పరును స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడప ఎన్జీవో కాలనీలో చోరీ

కడప (క్రైం), ఫిబ్రవరి 28: నగరంలోని ఎన్జీవో కాలనీలో ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. ఎన్జీవో కాలనీకి చెందిన సురేశ్, అతడి భార్య ఇరువురూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మంగళవారం వారు డ్యూటీకి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి దూరి 10 తులాల మేర బంగారు నగలు అపహరించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

విజిలెన్స్ దాడుల్లో సిలిండర్లు సీజ్


సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), ఫిబ్రవరి 28 : గృహావసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటళ్లలో వాడుతున్నట్లు తెలియడంతో కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. సిలిండర్లను సీజ్ చేశారు. మైదుకూరు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మి నరసింహ హోటల్‌పై దాడులు నిర్వహించి ఐదు సిలిండర్లను సీజ్ చేసి వెన్నెల భారత్ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. హోటల్ యజమాని యు.నరసింహయ్యపై కేసు నమోదు చేశారు. వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వాడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జి.ఈదురుబాషా, ఎంఆర్‌ఐ మహేంద్రనాథరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జనార్ధన్‌రావు, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రంగస్వామి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28: గంగమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, జాతర మార్చి 10 నుంచి 12వ తేదీ వరకు జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని రాయచోటి ఆర్డీవో రంగస్వామి, డీఎస్పీ మహబూబ్‌బాషలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక గంగమ్మ ఆలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగమ్మజాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు సకాలంలో మంచినీరు అందించాలని, రెవెన్యూ, పంచాయతీ, సిబ్బంది జాతరలో అందుబాటులో ఉండి సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి క్షణం అందుబాటులో ఉండాన్నారు. జాతరలో అక్రమ మద్యం, నాటుసారా, విక్రయాలు జరగకుండా చూడాలని ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. కుంకుమ, చాందినీబండ్లు, బాణసంచాలు, ఊరేగింపుల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రెడ్డెన్న, సీఐ జీవన్ గంగనాథ, ఎంపీటీసీ సమరసింహారెడ్డి, కమిటీ సభ్యులు రెడ్డెయ్య, సర్పంచు వెంకటనారాయణరెడ్డి, ఆలయ ఈఓ రవీంద్రరాజు, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో రీజనల్ జాయింట్ కమిషనర్


గండి క్షేత్రంలో ఎంవీఎస్ మూర్తి

చక్రాయపేట, ఫిబ్రవరి 28: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిలో వెలసిన వీరాంజనేయస్వామిని బుధవారం తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీఎస్ మూర్తి దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజల ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం శాలువా కప్పి స్వామివారి చిత్రపటం అందించి సత్కరించారు. అనంతరం ఆయన క్షేత్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటటెండెంట్ తిరుమలరెడ్డి, రాయచోటి వీరభద్రస్వామి దేవస్థానం ఈఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఒక్క యూనిట్ కూడా వృథా కాకూడదు

విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు : ఎస్ఈ రమణ


విద్యుత్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఎస్ఈ

చిన్నమండెం, ఫిబ్రవరి 28: మండలంలోని విద్యుత్ కార్యాలయాన్ని ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సూపరింటెంట్ ఇంజనీర్ ఎస్.రమణ సందర్శించారు. నెలసరి విద్యుత్ బిల్లుల వసూళ్ల లక్ష్య సాధన కొరకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని హెచ్చరించారు. చిన్నమండెంలో విద్యుత్ అంతరాలు అధికంగా ఉన్నాయని, ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరం తద్వారా అంతరాయాలు ఏర్పడటమే కాకుండా విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలను చైతన్యవంతులు చేసి విద్యుత్ ప్రమాదాలు లేకుండా చేయాలని తెలిపారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డుకునేవారెవరు..?

- చీకటి పడగానే వాలుతున్న ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు
- అడ్డూ అదుపు లేని ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు


పెన్నానది వంతెన సమీపాన పడమరవైపు ఇసుక తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న దారులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 28: జమ్మలమడుగు మండలంలోని గూడెంచెరువు గండికోట దారి, సున్నపురాళ్లపల్లె, కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లో ఇసుక, మట్టి యథేచ్చగా అక్రమరవాణా జరుగుతోంది. గత నెలలో రాత్రీపగలు అనే తేడా లేకుండా తరలించేవారు. ఇటీవల సంబంధిత అధికారులు బదిలీ అయి కొత్తవారు వచ్చారు. దీంతో ఇప్పుడు రాత్రిపూట మాత్రమే అక్రమ రవాణా జరుగుతోంది. ఇసుక, ఎర్రమట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

గూడెం చెరువు గ్రామం గూడాదేవి చెరువులోంచి మట్టి తరలించడం కోసం చెరువులో మూడువైపుల దారులు ఏర్పాటు చేసుకున్నారు. ఒకవైపు అధికారులు, పోలీసులు వచ్చినా మరోవైపు నుంచి ట్రాక్టర్లు, ఎక్సకవేటర్లు తీసుకుని వెళ్లిపోయేందుకు ఏర్పాటు చేసుకున్నట్లు గ్రామస్థుల ద్వారా తెలుస్తోంది. గండికోట మార్గంలో రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా మట్టి తవ్వి తరలించడంతో గుంతలు దర్శనమిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు, అధికారుల అండతో మట్టి తరలిస్తున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి.

పెన్నా నదిలో..


గూడాదేవి సమీపాన గ్రావెల్ తరలింపుకోసం ఏర్పాటు చేసుకున్న దారి

అలాగే జమ్మలమడుగు-ముద్దనూరు రోడ్డులో వంతెన కింద పడమరవైపు ఇసుక తరలింపు కోసం దారి ఏర్పాటు చేసుకున్నారు. గతంలో పెన్నానది వంతెన పిల్లర్ కుంగిపోయినప్పుడు అదే నదిలో అప్పటి ఇసుక రీచ్‌కు సంబంధించిన ప్రతినిధి గ్రావెల్ వేసి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీరు వదిలినప్పుడు ఈ రోడ్డు అక్కడక్కడ దెబ్బతింది. ప్రస్తుతం నదిలో నీళ్ల తగ్గడంతో ఆ దారిలో గుంతలకు మరింత మట్టిపోసి రాత్రి సమయాల్లో ఇసుక తరలిస్తున్నారు.

చీకటి పడితే చాలు..

చీకటి పడగానే గూడెం చెరువులోని గూడాదేవి చెరువు వద్ద, గండికోట దారిలో, పెన్నానది వంతెన సమీపాన గద్దలు వాలినట్లుగా ట్రాక్టర్లు, ఎక్సకవేటర్లు వాలుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అలాగే జమ్మలమడుగు మండలంలోని మోరగుడి మూడురోడ్ల కూడలి వైపు నుంచి టీచర్స్ కాలనీవైపు నుంచి, తాడిపత్రి రోడ్డులో రచ్చబండ సమీపం నుంచి పెన్నా నది గుండా అక్రమంగా రవాణా చేస్తున్నారు. అలాగే మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలో చీకటి పడినప్పటి నుంచి తెల్లవారుజాము వరకు జోరుగా బయటి ప్రాంతాలవారు ఇసుక అక్రమంగా తీసుకెళుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇసుక, గ్రావెల్ తరలి పోతోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ సమస్యకు సంబంధించి జమ్మలమడుగు తహశీల్దారు కరుణాకరను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తమ సిబ్బందిని ఏర్పాటు చేసి ఎక్కడా మట్టి, ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.


గూడాదేవి చెరువు నుంచి మట్టి తరలించేవారు దారి ఏర్పాటు చేసుకున్న దృశ్యం

వికసిత్ భారత్ లక్ష్యంగా శాస్త్ర పరిశోధనలు

గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్‌ది మెరుగైన స్థానం : వైవీయూ వీసీ



సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 28 : ఆధునిక శాస్త్ర పరిశోధనలతో ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిచి భవిష్యత్తులో వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటుందని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతాసుధాకర్ స్పష్టం చేశారు. బుధవారం వైవీయూ జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరైన వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవం టీం వికసిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతగా నిర్ణయించారన్నారు. సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ల పట్ల ప్రజల ప్రశంసలు ప్రోత్సహించడంలో వ్యూహాత్మక దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం స్వదేశీ సాంకేతికత ద్వారా సవాళ్లను పరిష్కరించడానికి భారతీయ శాస్త్రవేత్తల విజయాలు సాధించారన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు అప్పారావు భారతదేశంలో విజ్ఞాన పర్యావరణ శాస్త్రాల పురోగతి అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. సైన్స్‌తో ప్రపంచమంతా ప్రయోజనం పొందుతుందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రేరణతోనే విజ్ఞానశాస్త్ర ప్రగతి ఉంటుందన్నారు. వాతావరణ మార్పు, జీవవైవిధ్యం, పర్యావరణ స్థిరత్వం, ఆహార భద్రత, మైక్రో ప్లాస్టిక్ ముప్పు, అణు భద్రత, మానవ జనాభా వంటి గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనే దిశగా పరిశోధనలు సాగాలన్నారు. రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ సైంటిస్టుల వల్లనే అన్ని సౌకర్యాలు పొందగలుగుతున్నామన్నారు. చెన్నై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసరు రమేష్ లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సైన్స్‌డే కమిటీ సభ్యులు , విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో అడుగుపెట్టే అర్హత ఆయనకు లేదు


జగదీశ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 28 : యోగివేమన యూనివర్సిటీలో జరిగిన సైన్స్‌డే సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ అప్పారావును పిలవడంపై విద్యార్థి సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోబ్యాక్ అప్పారావు అంటూ నినాదాలు చేశారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగులో జరుగుతున్న సెమినార్‌ను రాయలసీమ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆర్వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మల్లేల జగదీశ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన హెచ్‌యూ పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యకు కారకుడైన మాజీ వైస్‌చాన్సలర్ అప్పారావుపై ఎఫ్‌ఐఆర్ నమోదైందన్నారు. ఇటువంటి విద్యా ద్రోహిని యూనివర్సిటీకి చీఫ్ గెస్ట్‌గా పిలవడం సిగ్గుచేటన్నారు. కులం పేరుతో పరిశోధక విద్యార్థి రోహిత్ వేములను అవమానించి ఆత్మహత్య చేసుకునేలా చేశాడన్నారు. అప్పారావును పిలవడంపై యూనివర్సిటీ విద్యార్థులకు వీసీ, రిజిస్ట్రార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదంటే ఈ విషయంపై గవర్నరుకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్వీఎస్ పరిశోధక విద్యార్థి భరత్, సుమన్ పాల్గొన్నారు.

వైవీయూ ప్రతిష్ఠ దిగజారుస్తున్న అధికారులు: ఏఐఎస్‌ఎఫ్

పరిశోధక విద్యార్థి మృతికి కారకుడైన వైస్ చాన్సలర్ అప్పారావును వైవీయూలో సైన్స్‌డేకి ముఖ్యఅతిథిగా పిలవడం సహించరానిదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు తెలిపారు. 2016లో హెచ్‌సీయూకు చెందిన రోహిత్ వేముల అనే విద్యార్థిని కుల అహంకారంతో వేధింపులకు గురి చేయడంతో పాటు, పరిశోధనకు సంబంధించిన నిధులు రాకుండా అడ్డుకుని ఆత్మహత్యకు ప్రేరేపించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనిపై యూనివర్సిటీ అధికారులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అరుణ్, శివతేజ, చంద్ర, లక్ష్మీనారాయణ పాల్గన్నారు.

మాతృమరణాలు జరగకుండా చర్యలు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: జిల్లాలో పేదలకు వైద్యసేవలు మెరుగ్గా అందేలా వైద్యశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో కూడా మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఓఎస్డీ రఘునాథ్ పేర్కొన్నారు.

జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్సు హాలులో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని కామనూరు, కల్లూరు, కలసపాడు, దువ్వూరు, వనిపెంట ప్రాథమిక ఆసుపత్రుల పరిధిలో గతంలో సంభవించిన మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. మాతృమరణాలకు సంబంధించి గల కారణాలను సంబంధిత పీహెచ్‌సీ వైద్యులు, ఉన్నత ఆసుపత్రుల స్పెషలిస్టు వైద్యులు, ప్రైవేట్ నర్సింగ్ వైద్యులతో చర్చించారు. ఆసుపత్రుల్లో అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు. మాతృమరణాలపై నివేదికలు ఇవ్వాలని విచారణాధికారిగా డీసీహెచ్‌ఎస్‌కు సూచించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమాదేవి, డాక్టర్ లక్ష్మీసుశీల, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య కళ్ల ముందే భర్తను కబళించిన మృత్యువు

ములకలచెరువు, ఫిబ్రవరి 28: భార్య కళ్ల ముందే భర్తను మృత్యువు కబళించింది. రోడ్డు దాటుతున్న రైతును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని బురకాయలకోట పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రైతు బిల్లా వెంకటరమణ, అతడి భార్య లక్ష్మమ్మ మదనపల్లె మండలం సీటీఎంలో జరిగిన తిరుణాలకు వెళ్లారు. తిరుణాల చూసుకుని తిరిగి బుధవారం ఉదయం స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో బురకాయలకోటలో ఆర్టీసీ బస్సు దిగి ముంబాయి-చెన్నై జాతీయ రహదారి దాటుతుండగా రైతు వెంకటరమణను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కళ్ల ముందే వెంకటరమణను మృత్యువు కబళించడంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. తేరుకొనే సరికి భర్త మృతి చెందడంతో బోరున విలపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. రెడ్డివారిపల్లెలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు కడపకు కంచి పీఠాధిపతి రాక

కడప (కల్చరల్) ఫిబ్రవరి 28: విజయయాత్రలో భాగంగా కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఈనెల 29వ తేదీ గురువారం కడప నగరానికి రానున్నారు.

మార్చి 2వ తేదీ శనివారం వరకూ కడప నగర సందర్శన చేయనున్నారు. మూడు రోజుల పాటు కడప-తిరుపతి హైవే రోడ్‌లోని చిన్మయ మిషన్ లలితా పంచాయతన దేవాలయంలో ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటలకు భక్తులకు స్వామి వారి దర్శనం, ఆశీర్వాదం, త్రికాల పూజ, విశేష పూజలు నిర్వహించనున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, వారి ఆశీర్వాదాన్ని పొందాలని చిన్మయమిషన్ ప్రతినిధులు కోరారు.

రెండోరోజు ప్రశాంతంగా టెట్


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అబ్జర్వర్, డీఈవో

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 28: ఉపాధ్యాయ పోస్టుల కోసం డీఎస్సీ రాయబోయే అభ్యర్థులు ముందుగా ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష రాయాల్సి ఉంది. ఇందులో భాగంగానే అటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఇటు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న టీటీసీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 27వ తేదీ మంగళవారం నుంచి మార్చి 6వ తేదీ వరకు 9 రోజుల పాటు ఉపాధ్యాయ అర్హత పరీక్షకు హాజరు కానున్నారు. ఇందులో భాగంగానే విద్యాశాఖ అధికారులు జిల్లాలోని రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే బుధవారం రెండోరోజు ఉదయం జరిగిన సెక్షన్-1 పరీక్షకు 350 మందికి గానూ 298 మంది హాజరుకాగా, 52 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెక్షన్-2 పరీక్షకు 348 మందికి గానూ 303 మంది హాజరుకాగా 45 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సందర్భంగా సిమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి, ఎంఈవో బాలాజీనాయక్‌లు రాయచోటి పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజ


నియామకపత్రం అందుకుంటున్న నాగరాజ

వేంపల్లె, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా వేమా నాగరాజ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుదవారం వేంపల్లెలోని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవ, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, అమర్‌నాథరెడ్డి, మదనపల్లె పార్లమెంట్ అభ్యర్థి రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాసుపోర్టు పోయినది

తుంటి నరసింహులు తండ్రి కొండయ్య D.No. 2/71, ఎగువ సిద్దవరం విలేజ్, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియన్ పాసుపోర్టు నెం. L9588639 పోయినది. దొరికినవారు అందజేయగలరు Ajc-185474

కావలెను

రూపశ్రీ న్యూరో మైండ్ క్లినిక్ నందు పనిచేయుటకు Receptionist కావలెను. అడ్రస్ : డోర్ నెంబర్ 3/41, సాయిబాబా థియేటర్ ఎదురుగా,విష్ణుప్రియ హోటల్‌ప్రక్కన, ఆర్.ఎస్. రోడ్, కడప, సెల్ : 80749 53824 Ajc-185247

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14152

CHANGE OF NAME

★ I, SHAIK HABEEBULLAH BASHA (Old Name) 15/109-upstair, Pedda Besta Street, Kadapa, YSR District, A.P. India. Have changed my name to SHAIK HABEEBULLAH (New Name). AJH-002270

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647 AJA- 176967

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

భవిష్యత్తు మీది-గ్యారంటీ మాది



నక్కలపల్లెలో ప్రచారం చేస్తున్న రేవతి

చిట్వేలి, ఫిబ్రవరి 28: టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని రైల్వేకోడూరు నియోజకవర్గ మహిళా నాయకురాలు నగరిపాటి రేవతి తెలిపారు. బుధవారం మండలంలోని నక్కలపల్లె, జెట్టివారిపల్లె, సి.కందుల వారిపల్లె తదితర గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని, ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారంటీ ఇస్తున్నారన్నారు. ఏ గ్రామంలోకి వెళ్లినా టీడీపీకి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేనేపల్లి చిన్నా, నగరిపాటి మహేష్, బాలు, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభకు తరలిన టీడీపీ శ్రేణులు

● టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప

సుండుపల్లె, ఫిబ్రవరి 28: రాయచోటిలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ సమావేశానికి సుండుపల్లె మండలం నుంచి సుమారు వెయ్యి మందికి పైగా బీసీ నాయకులు, టీడీపీ నాయకులు తరలివెళ్లినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కర్లె రెడ్డెప్ప తెలిపారు. బీసీల ఐకమత్యం కోసం టీడీపీ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతోందని తెలియజేయగానే ఇంతమంది బీసీలు రావడం సంతోషదాయకమన్నారు. ఇదే విధంగా ఐకమత్యంతో ఉండి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి రాంమోహన్, బీసీ నాయకులు రమణ, జనార్ధన్, ఎల్వీ రమణ, ప్రసాద్ రాజు, గ్రామ అధ్యక్షుడు సుబ్బరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతమ్మ ఆలయం ప్రారంభోత్సవం



ముక్కా కుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 28: మండలంలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతీ అరుంధతివాడ గ్రామ ప్రజల కోరిక మేరకు ముక్కా రూపానంద రెడ్డి ఫౌండేషన్ అధినేత రూపానందరెడ్డి సహకారంతో మాతమ్మ ఆలయం నిర్మించారు. ఈ ఆలయాన్ని బుధవారం పూజా కార్యక్రమాలతో మొదలై మూడు రోజుల పాటు వివిధ రకాల పూజలు, యజ్ఞయాగలతో పూజలు జరుగుతాయని గ్రామ ప్రజలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి పూర్తిసాయం అందించిన ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులను విశిష్ట అతిథులుగా ఆహ్వానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, వడ్డి చెంగల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీనాథం జగదీశ్వర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, నారపరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

చిట్వేలిలో ఘనంగా టైలర్స్ డే

చిట్వేలి, ఫిబ్రవరి 28: మండల కేంద్రమైన చిట్వేలిలో బుధవారం టైలర్స్‌డే సందర్భంగా చిట్వేలి టైలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ టైలర్స్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక శివాలయంలో కేకును కట్ చేసి టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళా టైలర్స్‌కు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారిన ఫ్యాషన్ ప్రపంచంలో దర్జీల పరిస్థితి దయనీయంగా ఉందని, చేతివృత్తులను కాపాడేందుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేస్తే చేతివృత్తులకు చేతినిండా ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టైలర్స్‌ను రాజా, నాగరాజు, సుబ్బయ్య, రమేష్, సుబ్రమణ్యం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న రమేశ్‌నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 28: పట్టణంలోని బాలసదన్‌లో బుధవారం మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలబాలికలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోతుగుంట రమేశ్‌నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సంస్థ ద్వారా సమాజంలో నిర్భాగ్యులైన వారికి చేయూతనందించాలనుకోవడం ఆనందంగా ఉందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇలాగే మరెన్నో నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, చైర్మన్ రమణారెడ్డి, డైరెక్టర్స్ వేణుగోపాల్ నాయుడు, నందకిషోర్, ఐసీడీఎస్ అధికారులు సంధ్యారాణి పాల్గొన్నారు.





సైన్స్ ద్వారానే ప్రపంచ అభివృద్ధి



గాలివీడులో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం, నందలూరులో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గాలివీడు, ఫిబ్రవరి 28: ప్రస్తుత యుగంలో సైన్స్‌తోనే ప్రపంచం అభివృద్ధి పథంలో నడుస్తున్నదని బాలుర ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ప్రధానోపాధ్యాయురాలు మహమతి, ఉపాధ్యాయులు శివారెడ్డి, సుబ్బరాయుడు, సౌభాగ్యమ్మలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవం థీమ్ స్వదేశీ టెక్నాలజీస్ ఫర్ వికసిత్ భారత్ అనే నినాదంతో భారత దేశ సమగ్ర అభివృద్ధిలో సైన్స్ ప్రాముఖ్యతను గురించి వివరించారు.

లక్కిరెడ్డిపల్లె: విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీవీరామన్ ఒక పేద కుటుంబంలో జన్మించి ప్రపంచ నోబుల్ బహుమతి అందుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అధ్యాపకులు నిత్యపూజయ్య, విజయ, సుధాకర్, సుజాత, శ్రీకళ, శ్రీనివాసులు, విజయకుమారి, అరుణకుమారి, భారతి, రాజేశ్వరి, సుధీర్‌కుమార్, రసూల్, పీడీ సోమశేఖర్‌నాయక్, ఉమామహేశ్వరి, చక్రధర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని మల్లూరు జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయుడు రెడ్డెన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. సీవీ రామన్ విజ్ఞాన శాస్త్రానికి ఎంతో సేవ చేశారని, పలువురికి ఆయన మార్గదర్శకం అన్నారు. ప్రతి విద్యార్థి సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకొని శాస్త్రీయ దృక్పథం, కృషి పట్టుదల, అంకిత భావంతో భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండలంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రంపేట, పెనగలూరు ఆదర్శ పాఠశాల, నల్లపురెడ్డిపల్లె, నాయుడువారిపల్లె కట్టావారిపల్లె, కొండూరు, ఎన్.ఆర్.పురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పలు రకాల సైన్స్ ప్రయోగాలు చేసి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు ప్రిన్సిపల్ సహజబ్లెస్సీ, హెడ్‌మాస్టర్లు మధుసూదన్‌రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మానవ మనుగడకు సైన్సు ఆధారం అని రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్సు దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సుపై ప్రతి ఒక్క విద్యార్థికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి.దయానందం, విద్యార్థులు నూర్‌అహ్మద్, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు బుధవారం స్థానిక నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయులు శివవరప్రసాద్, సరోజిని, దేవి, రాగ సుధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారతదేశ ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందలూరు ఎంఈవోలు నాగయ్య, అనంతకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, క్విజ్ పోటీలు, సైన్స్ ప్రాజెక్టులు, ప్రయోగ అంశాలపై సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా ఎస్.రౌఫ్‌బాషా, సుభాష్ బాబులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుణ్యవతి, కృష్ణయ్య, హరికృష్ణ, రామకృష్ణ, కొండమూర్తి, రజిని, విమలమ్మ, సురేష్‌బాబు, శివయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మైనార్టీ యువకులు

● కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మండిపల్లి



ముస్లిం మైనార్టీ యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని అధిష్ఠానం ప్రకటించింది. దీంతో ఆయన నియోజకవర్గ ప్రజలు, యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం రాయచోటి మున్సిపల్ పరిధిలోని 3, 4, 5, 6, 8 వార్డులోని ముస్లిం మైనార్టీ యువకులు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయన మాట్లాడుతూ టీడీపీ తనపై అపారమైన నమ్మకం ఉంచిందని, పార్టీలోకి వచ్చిన వారికి, పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తానని భరోసా ఇచ్చారు. రానన్న ఎన్నికల్లో రాయచోటి టీడీపీ జెండా ఎగరవేసి చంద్రబాబును సీఎంను చేసే వరకు పోరాటం సాగించాలని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దీఖ్, సాదిక్, ఫయాజ్, మహ్మద్‌రఫీ, ఇంతియాజ్, అరీఫుల్లా, జిలాన్, సద్దాం, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

అభిషేకం చేసిన టీడీపీ అభ్యర్థులు

రాయచోటి పట్టణంలోని శివలింగానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అభిషేకం చేశారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

● ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 28: రాయచోటి మండలం చెన్నముక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రి సుమిత్ర మాట్లాడుతూ జగనన్న కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామంటూ గొప్పలు చెబుతున్నారే తప్ప ఎక్కడా కనీస సౌకర్యాలైన తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ నాయకురాలు నసీబ్‌జాన్, పలువురు మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టైలరింగ్ ద్వారా ఆర్థిక స్వావలంబన

పెనగలూరు, ఫిబ్రవరి 28: మహిళలు టైలరింగ్ ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి తమ కుటుంబాన్ని అభివృద్ధి పరుచుకోవాలని ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ సూచించారు. బుధవారం సాయంత్రం మండల స్త్రీశక్తి భవన్‌లో ఏసీ, ఏపీఎం నిరంజన్‌కుమార్ అధ్యక్షతన మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు శివ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి రూ.25 వేల చేయూత

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వెంకటకృష్ణకు మా ఊరి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రవిశంకర్ ఆధ్వర్యంలో బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.25 వేల నగదును అందజేశారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు తమ సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా కుటుంబాన్ని దాతలు ఆదుకోవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా మునేశ్వరస్వామి ఆరాధనోత్సవం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 28: బాలభక్త మునేశ్వర్‌స్వామి 22వ ఆరాధనోత్సవాలు బుధవారం మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, భక్తిపాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సాయివికాస్‌రెడ్డి, పచ్చిగాల చిన్నయ్య, ఉంగరాల సురేంద్ర, యెలిశెట్టి శంకర్, నవరం సాయి, మణిప్రకాష్, అరవింద్, మౌళి, నారపరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్, పాలసాని కిరణ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీటీకి ఓటరు జాబితా అందజేత

పెనగలూరు, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని పెనగలూరు కన్యకల చేపల చెరువు సొసైటీ ఓటరు జాబితాను బుధవారం ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఏడీ వెంకటేశ్వర్లు డీటీ మోహనకృష్ణకు అందజేశారు. మార్చి 7న పెనగలూరు చెరువు చేపల సొసైటీకి జరపనున్న 273 మంది ఓటర్ల జాబితాను పరిశీలించాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా అంతకంటే ముందు మండల పరిషత్ కార్యాలయంలో చాపల సొసైటీ ఓటర్ల సమావేశం ఉందని మంగళవారం గ్రామంలో దండోరా వేయించినప్పటికీ కేవలం 28 మంది సభ్యులు మాత్రమే సమావేశానికి హాజరైనట్లు ఆయన తెలిపారు.

అలరించిన 'బకాసురుడి వధ'

సంబేపల్లె, ఫిబ్రవరి 28: గుట్టపల్లె గ్రామం వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పంచమ వేద మహాభారత యజ్ఞంలో బుధవారం బకాసురుడి వధ సన్నివేశం అందరినీ అలరించింది. మహాభారతం విన్నా, చూసినా పుణ్యం కలుగుతుందని మొదటి నుంచి ప్రజల్లో ఉన్న నమ్మకం. అందుకోసమే గ్రామాల్లో పంచమ వేద మహాభారత యజ్ఞాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా గ్రామంలో చాందినీ బండి కట్టి బండి మీద ఊరేగింపు నిర్వహించారు.

జాతీయ లోక్‌అదాలత్ 16కు వాయిదా

నందలూరు, ఫిబ్రవరి 28: జాతీయ లోక్ అదాలత్ మార్చి 9న జరగాల్సి ఉండగా మహాశివరాత్రి, ప్రభుత్వ సెలవుల కారణంగా మార్చి 16కు వాయిదా వేసినట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు గమనించాలని కోరారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన శ్రీనివాసరాజు



మనోహర్‌తో శ్రీనివాసరాజు

నందలూరు, ఫిబ్రవరి 28: టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి బహిరంగ సభ సందర్భంగా తాడేపల్లిగూడెంలో జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ అధ్యక్షుడు నాదెండ్ల మనోహర్‌ను రాజంపేట జనసేన నేత శ్రీనివాసరాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బీజేపీ ప్రజాపోరు యాత్ర



ప్రజాపోరులో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 28: ఏపీ బీజేపీ ఆదేశాల మేరకు రాజంపేట అసెంబ్లీలో వైసీపీ అసమర్థ పాలనను ప్రశ్నిస్తూ ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఒంటిమిట్ట చెరువు బీటలు వారేలా మార్చి ప్రజలకు సాగు, తాగునీటికి కరువు ఏర్పడేలా చేసిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని అభివృద్ధి చేయాలని, గతంలో చెప్పినట్లు రూ.100 కోట్ల నిధులను త్వరితగతిన విడుదల చేసి దేవాలయ అభివృద్ధిలో నిజాయితీని నిరూపించుకోవాలని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కస్తూరి శ్రీధర్, బీజేపీ నాయకులు శ్రీధర్, మండల అధ్యక్షుడు శివరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు, పేరూరు కొండయ్య, మండల ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, సుబ్బరామయ్య, ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగస్వామి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28: ఏప్రిల్‌లో జరగబోవు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని పోలింగ్ కేంద్రాలను రాయచోటి ఆర్డీఓ రంగస్వామి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పకొండయ్యగారిపల్లె, లక్కిరెడ్డిపల్లె, రెడ్డివారిపల్లె, ఈడిగపల్లె, చౌటపల్లె, దిన్నెపాడు పోలింగ్ కేంద్రాల్లో సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, విద్యుత్, బాత్‌రూములు, వసతులను ఆయన పరిశీలించారు. వసతులు లేని పోలింగ్ కేంద్రాల్లో నాడు-నేడు కింద నిధులు మంజూరైన పాఠశాలలకు త్వరితగతిన వసతులు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ రెడ్డెన్న, ఎంఈఓ చక్రేనాయక్, పంచాయతీ కార్యదర్శిలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

రామాపురం, ఫిబ్రవరి 28: ఆదివారం జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య సిబ్బందికి మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కలు వేసే విధానం గురించి సిబ్బందికి వివరించారు. మొత్తం మండలంలో 4072 మంది 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు ఉన్నారని, మండలంలో మొత్తం 47 బూత్ కేంద్రాలు, 5 రూట్లు మండల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత, అంగన్వాడీ, జడ్పీ పాఠశాలలోనూ రామాపురం బస్టాండులో చిన్న పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. తమ చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులకు ఉందని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, రామకృష్ణుడు, ఈవోపీఆర్‌డీ ఉషారాణి, అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మజ, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసనలు తెలుపుతున్న మహిళలు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28: మండలంలోని కాకుళవరం పంచాయతీ చిలకపాటి వాండ్లపల్లె దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అధికారులను కోరారు. బుధవారం కాకుళవరంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి దళితుల ఓట్లు కావాలి కానీ వారి సమస్యలు పట్టవా అని ఆయన ఎద్దేవా చేశారు. మండలంలో 20కి పైగా దళితవాడలు ఉన్నాయని, ఒక్క గ్రామంలో కూడా కనీస వసతులు లేవన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు వెలిగల్లు నీరు అందించి తాగునీటి సమస్య లేకుండా చేస్తామని చెప్పినా, ఇప్పటి వరకు గ్రామాల్లో ఈ సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారని, అధికారులు స్పందించి (జేజేఎం) జల్‌జీవన్ నిధులతో బోరువేసి తాగునీరు సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

సచివాలయాలతో సేవలు అందిపుచ్చుకోవాలి

సంబేపల్లె, ఫిబ్రవరి 28: సచివాలయ కార్యాలయాల ద్వారా సేవలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మోటకట్ల, దేవపట్ల, నాగిరెడ్డిగారిపల్లె సచివాలయాలు విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల కార్యాలయాలను స్థానిక ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి, కడప డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆవుల వేణుగోపాల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, రాధికల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేబట్టారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రకాశ్‌నగర్ కాలనీకి చెందిన 212 మంది రైతులకు 217.74 ఎకరాల జడ్పీహెచ్‌సీ భూముల రెగ్యులర్ ఫ్రీ ల్యాండ్ పట్టాలను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ బరువు రెడ్డెన్న, సర్పంచ్ మోహన్‌ల ఆధ్వర్యంలో ఈ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ రామాంజులు, రెవెన్యూ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు చిదంబరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉపేంద్రారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

● మాజీ జడ్పీటీసీ జయమ్మ

సుండుపల్లె, ఫిబ్రవరి 28: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ప్రతిఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని మాజీ జడ్పీటీసీ, కళాశాల కరస్పాండెంట్ వై.జయమ్మ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాలలో 43వ వార్షికోత్సవం, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినీ, విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతను తెలియజేశారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో బాగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని, భవిష్యత్తు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. ఎంతో మంది పేద విద్యార్థులు ఈ కళాశాలలో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలియజేశారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు సుబ్బరాజు, ప్రిన్సిపాల్ శైలజ, రెడ్డిశేఖర్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకులు నాగార్జున పాల్గొన్నారు.

నీళ్లే రాని వీధి కుళాయిలు : బీజేపీ



బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న మహిళలు


నందలూరు, ఫిబ్రవరి 28: పాటూరు పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని, నామమాత్రంగా వీధి కుళాయిలు వేశారే తప్పితే... నీళ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని రాజంపేట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ ఆరోపించారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం పాటూరు గ్రామ పంచాయతీలో బీజేపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలోని పలు సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. నీటి సమస్యపై అటు పంచాయతీ అధికారులు గానీ, సర్పంచ్ గానీ పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చ నాయకుడు మస్తానయ్య, యువమోర్చ నాయకుడు శ్రీనివాసులు, కార్యదర్శి మురళి, వెంకటరమణ, సుదర్శన్ పాల్గొన్నారు.

మంగంపేట సమస్యలను పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 28: మంగంపేట సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఐ మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య హాజరై మాట్లాడుతూ మంగంపేట కాపుపల్లి గ్రామ పంచాయతీ సంబంధించిన సర్వే నెంబరు.8లో విస్తీర్ణం 72.77 ఎకరాల భూమి పూర్వకాలం నుంచి గుడి, రుద్రభూమిని పశువుల మేతకు వాడుకొంటున్నారని, కానీ ఇక్కడ ఏపీఎండీసీ వేస్ట్‌మట్టిని డంప్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. మొదటగా నష్టపరిహారం చెల్లించి గ్రామస్తులకు న్యాయం చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు శివయ్య, సీపీఐ నాయకులు ప్రతాప్‌రెడ్డి, తిరుపాలయ్య పాల్గొన్నారు.

బీసీల్లో పెరుగుతున్న ఆశలు.. అంచనాలు

● ప్రధాన పార్టీల టికెట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు



తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లపై బీసీల్లో ఆశలు, అంచనాలు పెరుగుతున్నాయి. పలు స్థానాల్లో ఇటు వైసీపీ నుంచీ అటు టీడీపీ నుంచీ అసెంబ్లీ టికెట్ల కోసం బీసీ సామాజికవర్గాలకు చెందిన పలువురు ఆశావహులు రేసులో వున్నారు. హోరాహోరీగా తలపడుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు మెజారిటీ ఓటర్లను ఆకట్టుకునేందుకు పోటాపోటీగా బీసీలకు అవకాశం కల్పించేందుకు యత్నిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ పార్టీలు అనుసరిస్తున్న ధోరణిని గమనిస్తున్న ఆశావహులు తాజా పరిణామాలు తమకు మేలు చేస్తాయని భావిస్తున్నారు. దీంతో పలువురు టికెట్ రేసులో గట్టిగా నిలిచి తమ అదృష్టాలను పరీక్షించుకుంటున్నారు. తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోని మొత్తం 17 స్థానాలకు గానూ తంబళ్ళపల్లి, పలమనేరు, కుప్పం, చంద్రగిరి, తిరుపతి, వెంకటగిరి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం బీసీల నుంచీ డిమాండ్ వుండగా టీడీపీ తొలి అభ్యర్థుల జాబితాలో తంబళ్ళపల్లి టికెట్ ఇతరులకు కేటాయించడంతో అక్కడ అవకాశం లేకుండా పోయింది. మిగిలిన చోట్ల ఎందరు టికెట్ సాధిస్తారో, టికెట్ సాధించిన వారిలో ఎందరు గెలుపు సాధిస్తారో తెలియదు గానీ ఆయా నియోజకవర్గాల నుంచీ ఆయా పార్టీల అధిష్ఠానాలకు బీసీ సామాజికవర్గాల తరపున తమ గళాన్ని మాత్రం బలంగా విన్పించడంలో సఫలమవుతున్నారు.

తిరుపతి, ఆంధ్రజ్యోతి

కుప్పంలో భరత్ పోటీ ఖాయమే!

కుప్పం నియోజకవర్గంలో వైసీపీ తరపున ఎమ్మెల్సీ భరత్ పోటీ చేయడం ఖాయమనే చెప్పాలి. ఆయనకు టికెట్ ప్రకటన లాంఛనప్రాయమే. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో వన్యకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన ప్రజలున్నారు. అదే వర్గానికి చెందిన భరత్ తండ్రి చంద్రమౌళికి వైసీపీ 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు టికెట్ కేటాయించింది. గత ఎన్నికల తర్వాత అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుమారుడు భరత్‌ను నియోజకవర్గ ఇంచార్జిగా ప్రకటించి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది వైసీపీ. జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారాయన. వన్యకుల క్షత్రియులు అధికంగా వున్నందున ఆ వర్గాలతో పాటు ఇతర బీసీల ఓట్ల కోసమే వైసీపీ భరత్‌కు టికెట్ ఇవ్వనుంది. అయితే టీడీపీకి, వ్యక్తిగతంగా చంద్రబాబుకు కంచుకోట వంటి కుప్పంలో ఆయన ముందు ఏ సమీకరణలూ పనిచేసే పరిస్థితి లేదనే చెప్పాలి.

తిరుపతి రేసులో నరసింహ యాదవ్

తిరుపతిలో అధికంగా వున్న బీసీ కులాలు సాంప్రదాయకంగా టీడీపీ వెన్నంటి వున్నప్పటికీ పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ బీసీలకు ఇక్కడ అవకాశం దక్కలేదు. ఇదే నినాదంతో తుడా మాజీ ఛైర్మన్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ఈసారైనా బీసీ కోటా కింద తనకు టికెట్ ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. నగరంలోని అన్ని బీసీ కులాలకు చెందిన టీడీపీ మద్దతుదారులు ఇటీవల ఒకటి రెండు పర్యాయాలు ఆత్మీయ సమావేశాలు కూడా నిర్వహించి పార్టీ టికెట్ డిమాండ్ చేశారు. అయితే వీరి డిమాండ్ పార్టీ అధిష్ఠానానికి చేరాల్సినంత బలంగా చేరడం లేదు. దీంతో బీసీల టికెట్ డిమాండ్ తిరుపతి వరకే పరిమితమవుతోంది తప్ప అధిష్ఠానానికి చేరడం లేదు.

పలమనేరు టికెట్ కోసం ఇద్దరి పోటీ

పలమనేరు నియోజకవర్గం తొలుత ఎస్సీ రిజర్వుడు సెగ్మెంట్. పునర్విభజనతో 2009 నుంచీ జనరల్ స్థానంగా మారింది. తొలి ఎన్నికల్లో టీడీపీ తరపున, 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున అమరనాధరెడ్డి గెలిచారు. అయితే తగిన గుర్తింపు లేని కారణంగా వైసీపీని వీడి టీడీపీలో చేరి మంత్రి కూడా అయ్యారు. 2019లో టీడీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు.ఆ ఎన్నికల్లో వైసీపీ బీసీ సామాజికవర్గంలో వక్కలిగ కులానికి చెందిన వెంకటే గౌడకు టికెట్ ఇవ్వగా ఆయన సంచలన విజయం సాధించారు. రానున్న ఎన్నికల్లో కూడా తనకే టికెట్ దక్కుతుందని ఆయన ధీమాగా వున్నప్పటికీ పోటీ మాత్రం తప్పడం లేదు. వక్కలిగ కులానికే చెందిన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు కూడా టికెట్ రేసులో వున్నారు. వైసీపీలో ఇద్దరూ బీసీలే టికెట్ కోసం పోటీ పడుతున్నారు. అవకాశం ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సి వుంది. గత ఎన్నికల్లో వైసీపీ మీద సానుభూతి పవనాలు వీచడంతో సులువుగా గెలిచినప్పటికీ రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి అమరనాథ రెడ్డిని ఢీకొనడం ఈ ఇద్దరిలో ఎవరికైనా అంత సులువైతే కాదు.



పుంగనూరులో రామచంద్ర యాదవ్ ఒంటరిపోరు

పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ తరపున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోటీ చేయడం ఖాయం. అలాగే టీడీపీ టికెట్ చల్లా రామచంద్రారెడ్డికే ఖాయమైంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప టీడీపీ అభ్యర్థి మారే అవకాశం లేదు. ఇక గత ఎన్నికల్లో జనసేన నుంచీ పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించి జనం దృష్టిని ఆకర్షించిన రామచంద్ర యాదవ్ వ్యక్తిగతంగానే మంత్రి పెద్దిరెడ్డిపై పోరాడి జనంలో క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే ఆయన జనసేన లేదా టీడీపీ అదీ కాకుంటే కనీసం బీజేపీలో చేరివున్నా ఉమ్మడి అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో బలంగా ప్రభావం చూపేవారు. అలా కాకుండా సొంతంగా రాజకీయ పార్టీ పెట్టడంతో ఆయన ప్రభావం తగ్గిందనే చెప్పాలి. రానున్న ఎన్నికల్లో అసలు ఆయన పుంగనూరు నుంచీ పోటీ చేస్తారో లేదో కూడా తెలియడం లేదు. అయితే ఇంత కాలం మంత్రి పెద్దిరెడ్డిపై పోరాడిన కారణంగా వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేస్తారని పుంగనూరు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా వున్న బీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వారి అంచనాలు ఏమవుతాయో వేచి చూడాల్సివుంది.

చంద్రగిరిలో బడి సుధా యాదవ్

చంద్రగిరికి సంబంధించి బీసీ నేత బడి సుధా యాదవ్ టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. తొలుత కాంగ్రెస్‌లో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అనుచరుడిగా వున్న ఇతడు 2014లో ఆమె వెంట టీడీపీలో చేరారు. అరుణకుమారి రాజకీయాల నుంచీ తప్పుకోవడంతో చంద్రగిరి పగ్గాలు పులివర్తి నానీ చేతికి వచ్చాయి. స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన కారణంగా పులివర్తి నానీతో ఇమడలేక 2019 ఎన్నికల తర్వాత వైసీపీలో చేరారు. పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డితో వ్యతిరేకించి తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచుగా గెలిచారు. అప్పటి నుంచీ వైసీపీకి దూరంగా వున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ టికెట్ కోసం గల్లా అరుణకుమారి కుటుంబం ద్వారా యత్నించారు. అయితే అప్పటికే పులివర్తి నానీ నియోజకవర్గంలో పాతుకుపోయి వుండడం, ఆయనను గెలిపించాలని సాక్షాత్తూ టీడీపీ యువనేత నారా లోకేశ్ చంద్రగిరి ప్రజలకు బహిరంగంగా పిలుపునిచ్చిన నేపథ్యంలో అక్కడ టికెట్ నానీకి తప్ప ఇతరులకు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో జనసేన తరపున చంద్రగిరి లేదా తిరుపతి నుంచీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కోసం యత్నిస్తున్నట్టు సమాచారం. అవకాశాల సంగతెలా వున్నా చంద్రగిరి నియోజకవర్గంలో బీసీ స్వరం వినిపించిన తొలి నాయకుడిగా సుధా యాదవ్ గుర్తింపు దక్కించుకున్నారు.

వెంకటగిరి టికెట్ కోసం మస్తాన్ యత్నాలు

వెంకటగిరి నియోజకవర్గంలో ఇంచార్జిగా కమ్మ సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వున్నారు. రామకృష్ణతో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా వెంకటగిరి టీడీపీ టికెట్ రేసులో వున్నారు. వీరి సంగతి పక్కన పెడితే ఈ నియోజకవర్గం నుంచీ ఈ పర్యాయం బీసీ వర్గాల నుంచీ మస్తాన్ యాదవ్ రేసులో నిలిచారు. పలువురు ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఈయన వారి ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబుపై ఒత్తిడి తెప్పిస్తున్నట్టు సమాచారం. అవకాశమిస్తే ఎన్నికల్లో ఎంత ఖర్చయినా భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో పాటు తనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు పలువురు ప్రముఖులు సిద్ధంగా వున్నారని అధినేతకు నివేదించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాదు కేంద్రంగా ఆయన టికెట్ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరు బలమైన ఆశావహుల నడుమ మస్తాన్ యాదవ్ చేస్తున్న ప్రయత్నం ఎంతవరకూ సఫలీకృతమవుతుందో తెలియదు కానీ నియోజకవర్గం నుంచీ టికెట్ కోసం బీసీ గళాన్ని మాత్రం ఆయన గట్టిగానే వినిపిస్తున్నారు.

తంబళ్ళపల్లిలో శంకర్ స్వయంకృతాపరాధం

2014లో టీడీపీ ఇచ్చిన అవకాశంతో గుళ్ళోళ్ళ శంకర్ యాదవ్ తంబళ్ళపల్లె నియోజకవర్గ తొలి బీసీ ఎమ్మెల్యేగా గెలిచి చరిత్ర సృష్టించారు. 2019 ఎన్నికల్లో కూడా టీడీపీ అవకాశమిచ్చినా ఓడిపోయారు. రానున్న ఎన్నికల్లో తిరిగి పోటీ చేసేందుకు గట్టిగా యత్నించారు. బీసీ కోటాలో ఆయనకు తప్పనిసరిగా మూడవ పర్యాయం కూడా అవకాశం దక్కుతుందని బీసీ వర్గాలు ఆశపెట్టుకున్నాయి. అయితే ఈసారి టికెట్ రెడ్డి సామాజికవర్గానికి చెందిన జయచంద్రారెడ్డికి కేటాయించారు. దీనికి శంకర్ యాదవే కారణమని, చేజేతులారా ఈ పరిస్థితిని కొని తెచ్చుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నివాసం, వ్యాపారాలు బెంగళూరులో వుండడంతో అడపాదడపా మాత్రమే శంకర్ నియోజకవర్గానికి రాకపోకలు సాగిస్తూ వచ్చారు. దీనిపై శ్రేణుల్లో అసంతృప్తిని పసిగట్టిన అధిష్ఠానం పలుమార్లు ఆయన్ను తీరు మార్చుకోవాలని, ఎక్కువ సమయం జనం మధ్యే గడపాలని హెచ్చరించింది. ఆరు నెలలు గడువు కూడా ఇచ్చింది. అయినా ఆయన తీరు మారలేదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో అధిష్ఠానం ప్రత్యామ్నాయం వైపు ఆలోచించి నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో రెండు సార్లు అవకాశమిచ్చిన టీడీపీ అధిష్ఠానం బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిందని, అయితే దాన్ని నిలుపుకోకుండా శంకర్ నియోజకవర్గానికి దూరమైనందువల్లే బీసీలకు అవకాశం లేకుండా పోయిందని బీసీ వర్గాలు ఆయనపై గుర్రుగా వున్నట్టు సమాచారం.

రామాపురం వద్ద చిరుత!

పూతలపట్టు, ఫిబ్రవరి 28: పూతలపట్టు మండలం రామాపురం అటవీ ప్రాంతంలో చిరుత సంచారాన్ని రైతులు గుర్తించారు. మద్దిలయ్య గారిపల్లె, రామాపురం గ్రామాల మధ్య అటవీప్రాంతంలో చుట్టుపక్కల గ్రామాల వారు పశువులను మేపుకొంటూ ఉంటారు. ఇలా అవులు మేపుకొంటున్న ఓ రైతు బుధవారం మధ్యాహ్నం చిరుతను చూసి కేకలు వేస్తూ గ్రామంలోకి పరుగు తీశారు. గ్రామస్తులు ఆ ప్రాంతానికి వచ్చి చూడగా చిరుత జాడలేదు. వీరి సమాచారంతో అటవీశాఖ అధికారులు వచ్చి చిరుత పాదముద్రలను గుర్తించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించి వెళ్లారు.

కర్ణాటక మద్యంతో పట్టుబడిన సర్పంచి



పలమనేరు, ఫిబ్రవరి 28: కారులో కర్ణాటక మద్యం తరలిస్తూ బంగారుపాళ్యం మండలం గొల్లపల్లి సర్పంచ్ ప్రకాష్‌నాయుడు పట్టుబడినట్లు పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. పలమనేరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు శివశంకర్, సహదేవి కేటిల్‌ఫారం ఫ్లైఓవర్ వద్ద గతరాత్రి వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. సర్పంచి కారును నిలిపి తనిఖీ చేయగా 864 బాటిళ్ల కర్ణాటక మద్యం, 384 టెట్రా ప్యాకెట్లు గుర్తించారన్నారు. సర్పంచిని అరెస్టుచేసి మద్యం, కారు సీజ్ చేశామని తెలిపారు. పట్టుబడిన సర్పంచిపై ఇప్పటికే బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌లో నాలుగు, అలిపిరి, మదనపల్లె టూటౌన్‌లో ఒక్కోటి చొప్పున ఆరు క్రిమినల్ కేసులు ఉన్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు.

రెండో రోజు టెట్‌కు 871 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్),ఫిబ్రవరి 28:రెండో రోజైన బుధవారం జరిగిన టెట్‌కు జిల్లాలోని మూడు, చెన్నైలోని ఒక సెంటర్‌లో నిర్వహించిన పరీక్షలకు 871 మంది హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. మొత్తం 994 మంది అభ్యర్థులకు గాను 871 మంది హాజరు కాగా, 123 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేస్తారా?

● 190 రామాపురం సీఎంసీ వద్ద అడ్డుకున్నరైతులు

గుడిపాల, ఫిబ్రవరి 28: గుడిపాల మండలం 190 రామాపురం సీఎంసీ వద్ద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండానే అధికారులు పనులు చేపట్టారు. దీంతో బుధవారం 190 రామాపురం దళితవాడకు చెందిన 20 కుటుంబాల వారు పనులను అడ్డుకున్నారు. సర్వే నెం.114లో 15.1 ఎకరాలకు రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించకపోవడంతో కోర్టును ఆశ్రయించామన్నారు. ఈ విషయం తేలేదాకా ఎవరూ భూమిలోకి వెళ్ళరాదని చెప్పినా సీఎంసీ అధికారులు కల్వర్టును ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. దళితవాడవాసులు, సీఎంసీ అధికారుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి రెండు వర్గాలకు సర్దిచెప్పి, మీ రికార్డులను తీసుకువస్తే పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఓట్ల లెక్కింపు కేంద్రంగా ఎస్వీసెట్ కళాశాల

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: త్వరలో జరగబోవు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు కేంద్రంగా చిత్తూరులోని శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ (ఎస్వీసెట్) కళాశాలను ఎంపిక చేసినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నామినేషన్ల స్వీకరణకు వారం రోజుల ముందు వరకు ఓటర్ల నమోదుప్రక్రియకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, పార్టీల ప్రతినిధులు సురేంద్ర కుమార్(టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు(బీజేపీ), పరదేశి(కాంగ్రెస్), గంగరాజు (సీపీఎం), ఉదయ్‌కుమార్ (వైసీపీ), వినాయక (ఆమ్‌ఆద్మీ పార్టీ), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేద ఖైదీలను ఆదుకునేందుకు కమిటీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: బెయిల్ లభించకుండా, జరిమానా చెల్లించేందుకు డబ్బుల్లేకుండా జైల్లో ఉంటున్న పేదఖైదీలకు ఆర్థిక చేయూతనిచ్చి ఆదుకునే దిశగా జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా జైళ్ల సూపరింటెండెంట్, సభ్యులుగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ఎస్పీ, జిల్లా జడ్జిచే నామినేట్ చేసే ఇన్‌చార్జి జడ్జి ఉంటారు. జైల్లో వున్న పేద ఖైదీల కేసును బట్టి బెయిల్ పొందేందుకు లేదా, జరిమానా చెల్లించేందుకు ఈ కమిటీ సిఫార్సు మేరకు నిధులను నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో మంజూరు చేస్తుంది. అవసరమైతే నోడల్ అధికారిని నియమించుకోవడానికి అనుమతిచ్చింది.

సీఎం సభానంతరం ఇలా..





ప్రైవేటు లే అవుట్‌లో తొలగించిన కూసాలు - విరిగిన కూసాలు



సభాస్థలి వద్ద పేరుకుపోయిన చెత్త

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 28: శాంతిపురం మండలం మఠం వద్ద సీఎం జగన్ సభ ముగిసి మూడు రోజులైంది. అనంతర దృశ్యమే స్థానికులకు ఖేదాన్ని మిగిల్చింది. బసవేశ్వరస్వామి, డీకేటీ భూములు కలిసిన సుమారు ఏడెకరాల స్థలంలో సభ నిర్వహించారు. దానికి అటు కిలోమీటరు, ఇటు కిలోమీటరు దూరంలో మఠం, గుండిశెట్టిపల్లె పరిసరాల్లో రోడ్డుకు రెండువైపులాఆ వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. సభ నిర్వహించిన ప్రాంతంలో టెంట్లను బుధవారం తొలగించారు. కానీ, ఈ ప్రాంతమంతా పడిన చెత్తాచెదారాన్ని అలాగే వదిలేశారు. పార్టీ జెండాలు, ప్లకార్డులు, తాగిపారేసిన నీళ్ల, మజ్జిగ ప్యాకెట్లతో దారుణంగా ఉంది. ఇక, పార్కింగ్‌కోసం గుండిశెట్టిపల్లె వద్ద ఓ ప్రైవేటు లే అవుట్‌లో నాటిన కూసాలను తొలగించి, విరగ్గొట్టి విధ్వంసం సృష్టించారు. అడ్డుకోబోయిన లే అవుట్ యజమానికి తిరిగి కూసాలు నాటిస్తామంటూ హామీ ఇచ్చారు. అలాగే హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన ఎంకే.పురం వద్ద కూడా ప్రైవేటు లే అవుట్‌లో కూసాలు తొలగించినా, బుధవారం దాకా నాటినవారు లేరు. నేలమీద పడి, విరిగిన కూసాలే కనిపిస్తున్నాయి. మిగిలిన పార్కింగ్ స్థలాల్లోనూ చెత్తాచెదారం పోగు పడింది.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

● స్వర్ణరథంపై విహరించిన వినాయకుడు





ఆలయ ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు - స్వర్ణ రథంపై విహరిస్తున్న వరసిద్ధుడు

ఐరాల (కాణిపాకం) ఫిబ్రవరి 28: కాణిపాక ఆలయంలోని ఆస్థాన మండపంలో బుధవారం ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా సంకటహర గణపతి వ్రతాన్ని భక్తులు నిర్వహించారు. పౌర్ణమి గడచిన నాలుగవ రోజున ఈ వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవర్లను స్వర్ణరథంపై ఉంచి మాడవీధులలో ఊరేగించారు. మాజీ ఉపరాష్ట్రపతి కుమార్తె దీపావెంకట్, ఈవో వెంకటేశు, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, రాయలసీమ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ రీజినల్ ఛైర్‌పర్సన్ శైలజాచరణ్‌రెడ్డి, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడని టికెట్ అడిగితే అవమానిస్తున్నారు

● చనిపోతానంటూ వైసీపీ దళిత నేత డేవిడ్ వీడియో



పురుగు మందు డబ్బాతో డేవిడ్

కేవీబీపురం, ఫిబ్రవరి 28: సత్యవేడు వైసీపీ టికెట్ ఆశించిన కేవీబీపురం మాజీ జడ్పీటీసీ డేవిడ్ మనస్తాపం చెందారు.టికెట్ అడిగినందుకు తనను అయినవారే ఎగతాళి చేస్తున్నారంటూ బాధపడుతూ ఆత్మహత్య చేసుకుంటున్నానని సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియో పోస్టు చేశారు. అది వైరల్ కావడంతో డేవిడ్ కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.సత్యవేడు టికెట్ ప్రతిసారీ బయటివారికి కేటాయించి స్థానికులను నిరాశ పరుస్తున్నా రనేది డేవిడ్ వాదన. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని,ఎంపీ మిధున్ రెడ్డిని కలిసిన డేవిడ్ స్థానికుడిగా తనకు సత్యవేడులో పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయం తెలిసి స్థానికంగా కొంతమంది నాయకులు నీ స్థాయికి ఎమ్మెల్యే టికెట్ కావాలా అంటూ తనను అవహేళన చేస్తూ మాట్లాడుతుండడంతో మనస్తాపం చెంది తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.డేవిడ్ కుటుంబసభ్యులు ఆందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆయన ఇంటి వద్దకెళ్ళిపరిశీలించారు. అయినా డేవిడ్ ఆచూకీ దొరకలేదు.పోలీసులు ఫోను లోకేషన్‌ను ట్రేస్ చేయడానికి ప్రయత్నించగా అది స్విచ్‌ఆఫ్‌లో ఉంది.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I,S.SUDKHARA NAIDU (Old Name), S/o S.Kesavulu Naidu, residing at #2-53, Seshapuram Village, Palamakulapalli Post, Bangarupalyam Mandal, Chittoor District, AP, Pin-517429 hereby declare that I have changed my name as SIRIMAVILLA SUDHAKAR (New Name) for all future purposes

AJT - 4406

CHANGE OF NAME

I, A.THEJITHA CHOWDARY (Old Name), D/o. A.Soundar Naidu, R/o. D.No.187/8-172, New Balaji Colony, M.R.Palli Circle, Tirupati Urban, Tirupati District, A.P., Here change my name as A.TEJITHA CHOWDARY (New Name)

AJT -10334

WANTED

తిరుపతి బైరాగి పట్టెడ వద్ద ఉన్న ఓల్డ్ ఏజ్ హోం నందు పని చేయుటకు లేడీ Care Takers కావలెను. సెల్ : 73861 76333

AJT - 6127

WANTED

సింగు సొల్యూషన్స్ వారు నిర్వహిస్తున్న APSRTC తిరుపతి కార్గో నందు పనిచేయుటకు డిగ్రీ చదివిన, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన యువకులు కావలెను. సెల్ : 8688818881

AJT - 179577

TOLET

తిరుపతి తిలక్ రోడ్డు, శ్రీదేవి కాంప్లెక్స్, ఎదురుగా 1st Floor (Only Family) 1 BHK హౌస్ బాడుగ కు ఇవ్వబడును (కూరగాయలు Market ఎదురు సందు) Cont : 8331827296

AJT - 6129

FINANCE

Govt. ఎంప్లాయిస్‌కు, రిటైర్డ్ పెన్షనర్లకు వాయిదా పద్ధతిలో గానీ, నెలవారీ వడ్డీ పద్ధతిలో గానీ 50 వేల నుండి 5 లక్షల వరకు ఫైనాన్స్ ఇవ్వబడును. సిబిల్ స్కోర్ అవసరం లేదు, J.K అసోసియేట్ సర్వీసెస్. GRN:136/2009. Cell: 9666547338.

AJD:177160

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA- 176967

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి


మదనపల్లెలో సైన్సు ప్రదర్శనలను నిర్వహిస్తున్న శ్రీనివాస కళాశాల విద్యార్థులు


తంబళ్లపల్లె విద్యార్థి రూపొందించిన రాకెట్ నమూనాను పరిశీలిస్తున్న ఎంఈవోలు


పీలేరులో సైన్స్ ఎగ్జిబిషన్‌లో నమూనాలు పరిశీలిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు


పీటీఎంలో విద్యార్థుల ప్రయోగాలు పరిశీలిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్/అర్బన్, ఫిబ్రవరి 28: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు విష్ణుప్రియ బహుమతులు అందజేశారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో కళాశాల చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరోనా, తుఫాను, భూకంపం వంటి విపత్తులు ఎదురవుతున్నా మానవుడు మనుగడ కేవలం సైన్సుతోనే సాధ్యమన్నారు. సైన్సు పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన రక్తనమూనా పరీక్షల యంత్రం, పోలియో వాక్సినేషన్ ప్లాంట్, ఫొటో ప్లాస్ట్ కల్చర్, వాటర్ ప్యూరిఫికేషన్ ప్రయోగాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో రెడ్డిశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు. జ్ఞానోదయ పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో బాలబాలికలు వివిధ అంశాల లో ప్రయోగాలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద రావు, డైరెక్టర్ భవానీ ప్రసాద్, టీచర్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తే దేశ భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతుందని ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం సర్‌సీవీ రామన్ జన్మదినాన్ని పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము రూపొందించిన పలు రకాల ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఇందులో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరులో: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పీలేరు మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో బుధవారం పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. 1వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో వివిధ నమూనాలను తయారు చేసి తమ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శించారు. జిల్లా సాంఘిక అటవీ శాఖాధికారిణి నాగమునీశ్వరి పీలేరు పట్టణంలోని ఇండియన్ బీచ్ ట్రీ పాఠశాలలో జరిగిన సైన్స్ దినోత్సవంలో పాల్గొని అక్కడి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తలపుల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎస్‌జీ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రెడ్డప్ప, సురేంద్రనాథరెడ్డి, ఫౌజియా బేగం, సుధాకర్, మధుసూధన్‌రెడ్డి, అధ్యాపకులు సైఫుల్లా, వెంకటరత్నం, రాధాకృష్ణ, శ్రీనివాసులురెడ్డి, ఆనంద్, ఇండియన్ బీట్ ట్రీ స్కూలు ప్రిన్సిపాల్ భార్గవి, సీఆర్‌పీలు అశోక్, మురళీధర్ రాజు పాల్గొన్నారు.

కలకడలో: మండలంలోని కోన హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని హెచ్‌ఎం చెంగల్‌రాయులు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో మునీంద్రనాయక్ మాట్లాడుతూ శాస్త్రవేత్తగా సర్ సీవీరామన్ భారతదేశ ఖ్యాతిని ప్రపంచదేశాలకు విస్తరింపజేశారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను తయారీ చేసిన సైన్స్ ప్రయోగాలను పరిశీలించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రామచంద్రారెడ్డి, మహేశ్వరి, షౌకత్ ఉన్నారు.

కురబలకోటలో: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన పరిశోధనలు చేపట్టి దేశాభివృద్ధికి పాటుపడాలని మిట్స్ వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్ పేర్కొన్నారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీవీ రామన్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే మండలంలోని అంగళ్ళు, కురబలకోట, ముది వేడు, తెట్టు పాఠశాలల్లో విద్యార్థులు తాము చేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ద్వారకనాథ్, విభాగాధిపతి చంద్రమోహన్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు సైన్స్ మేళాలో పాల్గొన్నారు. ఎంఈవో అధ్వర్యంలో సర్ సీవీరామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న సైన్స్ మేళా కార్యక్రమానికి డీవైఈవో శ్రీరాం పురుషోత్తం హాజరై విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలోని మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలతో పాటు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని వాల్మీకిపురం ఎంఈవో వెంకటరత్నం పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఏపీ మైనార్టీ బాలికల గురుకులంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్రసాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపిక, పుస్తకాలు అందజేశారు. ఏపీ మైనార్టీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ అరుణ, ఏపీకాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు షఫీ, నవమల్లిక, గీత, సోఫియా, విద్యార్థులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినసోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు కలిసి సుమారు 150కి పైగా సైన్సు ప్రదర్శనలను విద్యార్థులు ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు, తూర్పు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత తెలిపారు. ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలికిరిలో: స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం జయమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మండలంలోని పది ప్రాథమిక పాఠశాలలు, రెండు ఉన్నత పాఠశాలల విద్యార్థులు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వర్కింగ్ మోడళ్ళు, డెమో నమూనాలు ప్రదర్శించారు. సైన్స్ మేళాలో ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు ఎంఈవో కరీముల్లా బహుమతులు అందజేశారు. సీఆర్‌సీ కార్యదర్శి మురాద్‌షా, సైన్స్ ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు, సీఆర్పీ సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక ఇందిరమ్మ కాలనీ హైస్కూల్‌లో జరిగిన సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు 'గ్లోబెల్ చాలెంజెస్ అండ్ సొల్యూషన్స్' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. నమూనా ప్రదర్శనలో పి.రామచరణ్, డి.రెడ్డితేజ, ఎస్.సయ్యద్‌వలీ, శశాంకలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం సంపత్‌కుమార్, సైన్స్ ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్య కళ్ళ ముందే భర్తను కబళించిన మృత్యువు

ములకలచెరువు, ఫిబ్రవరి 28: భార్య కళ్ల ముందే భర్తను మృత్యువు కబలించింది. రోడ్డు దాటుతున్న రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు..మండలంలోని బురకాయలకోట పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రైతు బిల్లా వెంకటరమణ, అతని భార్య లక్ష్మమ్మ మదనపల్లె మండలం సీటీఎంలో జరిగిన తిరుణాలకు వెళ్లి వస్తుండగా రైతు వెంకరమణను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కళ్ళ ముందే వెంకటరమణను మృత్యువు కబళించడంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. తేరుకొనే సరికి భర్త మృతి చెందడంతో బోరున విలపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. రైతు మృతితో రెడ్డివారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, ఫిబ్రవరి 28: ఆర్థిక ఇబ్బందులతో భాస్కర్(48)అనే రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు...మండలంలోని చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లెకు చెందిన భాస్కర్ పంట సాగు కోసం అప్పులు చేశాడు. పంటలు చేతికందక పోవడంతో అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. అప్పులు చెల్లించాలని రుణదాతల నుంచి ఒత్తిళ్ళు అధికంగా రావడంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రూయాకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28: మదనపల్లె మండలం పుంగనూరు వాండ్లపల్లె వద్ద బుధవారం ఓ రైతుకు చెందిన గడ్డివామికి నిప్పంటుకుంది. గ్రామస్థుల సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారి జి.శివప్ప ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది హుటాహుటిన ప్రమాదస్థలి వద్దకు వెళ్లి గడ్డివామి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.30వేలు విలువ చేసే గడ్డివామి ఉండగా రూ.10వేలు నష్టం వాటిల్లిందని రైతు రాజేశ్ వాపోయాడు. మంటలను అదుపు చేసిన వారిలో ఫైర్ సిబ్బంది విజయ్, హమీద్, రెడ్డిశేఖర్, రాజేంద్ర ఉన్నారు.

సాగునీటి కోసం మహిళపై దాడి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28: సాగునీటి కోసం ఓ మహిళా రైతుపై ప్రత్యర్థులు దాడి చేశారు. బాధితురాలి కథనం మేరకు... మదనపల్లె మండలం కొండామరిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య చంద్రకళ(45) అదే గ్రామానికి చెందిన నారాయణస్వామి పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తోంది. ఈ క్రమంలో పంట కాలువ నుంచి సాగునీటి పారుదల విషయంలో అదే గ్రామానికి చెందిన అజయ్, మణి, రెడ్డెప్ప, హేమంత్‌లు వెళ్లి చంద్రకళతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో చంద్రకళ, నారాయణస్వామిలపై ప్రత్యర్థులు కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగ గాయపడిన చంద్రకళను కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్టు

పీలేరు, ఫిబ్రవరి 28: పీలేరు మండలం జంగంపల్లెకు చెందిన బొజ్జ గురవయ్య గత ఆదివారం తన భార్య అనితపై అనుమానంతో ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న గురవయ్యను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అనిత ప్రస్తుతం తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.


పదవీ విరమణ శుభాకాంక్షలు
వృత్తినే దైవంగా భావించి, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది నేడు పదవీ విరమణ చేయుచున్న మా నాన్న గారు శ్రీ వి.విజయబాబు గారికి మా హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు. మీ శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీ వి.విజయబాబు - శ్రీమతి వి.రాజేశ్వరి
Junior Assistant, Madanapalle Municipality
కుమారుడు : వి.సుకీర్త్
మ్యూచువల్ ఫండ్ మేనేజర్, బెంగుళూరు.
కుమార్తెలు అల్లుళ్లు
వి.స్వాతి వి.జె.మహేష్‌బాబు
Software Engineer, Bangalore
వి.సునీత బి.పవన్‌కుమార్
మరియు కుటుంబ సభ్యులు

బీసీ సభకు తరలిన టీడీపీ శ్రేణులు

ములకలచెరువు, ఫిబ్రవరి 28: జిల్లా కేంద్రమైన రాయచోటిలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి జయహో బీసీ సభకు తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అధ్వర్యంలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి బీసీలు పెద్ద ఎత్తున ప్రత్యేక వాహనాల్లో రాయచోటికి బయలుదేరి వెళ్లారు. అలాగే టీడీపీ అభ్యర్థి జయ చంద్రారెడ్డి సోంపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన మోహన అనారోగ్యంతో బాధపడుతుండడంతో రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

అనుమతులేని లే అవుట్‌పై చర్యలు తీసుకోండి

గుర్రంకొండ, ఫిబ్రవరి 28:గుర్రంకొండ పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా వేస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు సాంబశివ బుధవారం ఎంపీడీవో జగదీశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గుర్రంకొండ పట్టణం, ఇతర పంచాయతీలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా వెంచర్లు వేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ వెంచర్లు కూడా గుట్టలు, పోరంబోకు స్థలాలు, వంకలు, కుంటలను అక్రమించుకుని వేయడం దారుణమన్నారు. సలీంబాష తదితరులు పాల్గొన్నారు.

485 మంది ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

పీలేరు, ఫిబ్రవరి 28: పట్టణంలోని పేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఏపీఐఐసీ లే-ఔట్ 3లో బుధవారం కొత్తగా 485 మంది లబ్ధిదారులను రెవెన్యూ అధికారులు ఎంపిక చేశారు. గతంలో మాదిరి కాకుండా ఈ దఫా ఆన్‌లైన్‌లో లబ్ధిదారు ల ఎంపిక ప్రక్రియ ను నిర్వహించినట్లు తహసీల్దారు మహబూబ్ బాషా తెలిపారు. ఎంపి కైన వారికి గురువారం పట్టా పుస్తకాలు అందజేస్తామని వివరించారు.

ప్రభుత్వాస్పత్రికి రూ.30లక్షల విలువైన పరికరాలు వితరణ

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28: బెంగళూరు లోని గోకుల్‌దాస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి రూ.30లక్షల విలువైన ఆర్‌వో ప్లాంటు, వైద్య పరికరాలు వితరణగా అందజేశారు. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఇంటర్నేషనల్ క్లాతింగ్ ఫ్యాక్టరి నిర్వహిస్తున్న గోకుల్‌దాస్ సంస్థ బుధవారం ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు ఈ పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ క్లాతింగ్ ఫ్యాక్టరీ సీనియర్ జీఎం మల్లికార్జున మాట్లాడుతూ తమ సంస్థ నుంచి రూ.30 లక్షల విలువైన ఆర్‌వో ప్లాంటు, వీల్‌చైర్లు, వ్యాక్యూమ్ క్లీనర్, బీపీ యంత్రం మదనపల్లె ప్రభుత్వాస్ప త్రికి అందజేశామన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ క్లాతింగ్ ఫ్యాక్టరి డీజీఎం మహంతీష్ బంగారి, మేనేజర్ విజయకుమార్, హెచ్‌ఆర్ మేనే జర్ బాల సుబ్రమణ్యం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిం టెండెంట్ ఎంఎస్‌రాజు, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ జమున, ఎంఎస్ పద్మాంజలి, ఆర్‌ఎంవో రాజు,పాల్గొన్నారు.

మురాద్‌బీకుంటకు ట్రెంచ్ ఏర్పాటు

గుర్రంకొండ, ఫిబ్రవరి 28:రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలో చిక్కుకున్న మురాద్‌బీ కుంటకు ట్రెంచ్ ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం 'డీకేటీనే కదా...వేసెయ్ వెంచర్ అన్న' శీర్షిక ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూ అధికారులు మురాద్‌బీ కుంట సర్వేనెంబరు 16/1లో 3.34 ఎకరాల పూర్తి విస్తీర్ణాన్ని సర్వే చేయించారు. ఈ క్రమంలో ఎక్స్‌కవేటర్ ఉంచి కుంట చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేశారు.

ఆరుగురికి చేరిన మృతులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28: మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతులు ఆరుగురికి చేరారు. గత ఆదివారం సాయంత్రం బార్లపల్లె వద్ద జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరీష్ కూడా బుధవారం మృతి చెందాడు. నీరగట్టువారిపల్లెకు చెందిన హరీష్(33) చేనేత కార్మికుడుగా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య మల్లీశ్వరి ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుండగా హేమశ్రీ, గగన్ అనే ఇద్దరు పిల్లలు వున్నారు. ఈ క్రమంలో ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన హరీష్‌ను తిరుపతికి రెఫర్ చేయగా, అక్కడి వైద్యులు బ్రెయిన్ డెడ్ అని నిర్ధారించారు. దీంతో మదనపల్లెలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కేంద్ర పథకాలను తమవిగా చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్

ములకలచెరువు/బి.కొత్తకోట, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం తమవిగా చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ పేర్కొన్నారు. ములకలచెరువు బస్టాండు సర్కిల్‌లో బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి అధ్వర్యంలో జరిగిన ప్రజా పోరు యాత్రలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణాలను వైసీపీ ప్రభుత్వం కనీసం 15 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. బీజేపీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మంగరాజు, కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి శోభారాణి, నాయకులు పిల్లస్వామి నాయక్, శివన్న, రామదాసు, రజాక్, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌గౌడ్, సుధాకర్, బయారెడ్డి, డాక్టర్ హరినాధ రెడ్డి పాల్గొన్నారు. కాగా బి కొత్తకోట మండల పార్టీ అధ్యక్షుడు రామదాసు ఆధ్వర్యంలో బి.కొత్తకోటలో ప్రజా పోరు యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాపోరుయాత్ర కన్వీనర్ నానబాల లక్ష్మీకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గోరంట్ల రమేశ్, అసెంబ్లీ కన్వీనర్ మంగరాజు, నాయకులు గోపాల్‌రెడ్డి, శంకరమూర్తి, కావడి రవీంద్ర పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన పలువురు యువకులు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 28 : మండలంలోని రాపూరివారిపల్లె పంచాయతీకి చెందిన రాపూరి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 40 మంది యువకులు బుధవారం బీజేపీ చేరారు. బుధవారం రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ బి.కొత్తకోట మండల పర్యటనలో భాగంగా రాపూరివారిపల్లె గ్రామానికి చెందిన యువకులను శ్రీకాంత్‌రెడ్డి పార్టీలో చేర్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై యువకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలి

గుర్రంకొండ, ఫిబ్రవరి 28:రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనించి తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. బుధవారం సాయంత్రం గుర్రంకొండలో ప్రజాపోరు యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, పొత్తూరి శ్రీకాంత్, రామాంజులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనపై జనం విసిగిపోయారు


టీడీపీలో చేరుతున్న తీతవగుంటపల్లె గ్రామస్థులు

కలికిరి, ఫిబ్రవరి 28: వైసీపీ పాలన పైన ప్రజలు విసిగిపోయారని, ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేవీ పల్లె మండలం తీతవగుంటపల్లె పంచాయతీ నుంచి పలువురు గ్రామస్థులు బుధవారం రాత్రి నగరిపల్లెలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ అరాచకాలకు ముగింపు చెప్పడానికి ప్రజలు టీడీపీకి మద్దతు చెప్పడానికి ముందుకొస్తున్నారన్నారు. మఠంపల్లె, గ్యారం పల్లె, మోటుపల్లె మాజీ సర్పంచులు డి.నారాయణ నాయుడు, వెంకట్రమణారెడ్డి, సుధాకర్ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షురాలు గీతాంజలి, మాజీ ఎంపీపీ రమణ, రవిచంద్రారెడ్డి, ద్వారకనాథ్‌ల ఆధ్వర్యంలో ఇరివాండ్లపల్లెకు చెందిన భాస్కర, పెద్దన్న, రాజన్న, దామోదర, శివయ్య, వెంకటరణ, శివకుమార్‌లు ఉన్నారు.

పాఠశాలకు జిరాక్స్ మిషన్ వితరణ

పెద్దమండ్యం, ఫిబ్రవరి 28: పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి పంచాయతీ చిన్ననాయనగారిపల్లికు చెందిన కుమార్‌నాయుడు సిద్ధవరం కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలకు రూ. 15 వేలు విలువ చేసే జిరాక్స్ మిషన్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ రాణికుమారికు అంద.జేశారు. సర్పంచ్ విజయకుమారి, ఎంపీటీసీ రుక్మాంగధ రెడ్డి పాల్గొన్నారు.

కుప్పంలో జగన్ డ్రామాలకు ప్రజలు చెక్ పెడతారు


విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28: కుప్పంలో సీఎం జగన్ పర్యటనలో హంద్రీ-నీవా కాలువ నీళ్ల విడుదల చేసినట్లు వైసీపీ ప్రభుత్వం ఆడిన డ్రామాలకు ప్రజలు చెక్‌పెడతారని మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ విమర్శించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో దొమ్మలపాటి విలేకర్లతో మాట్లాడుతూ పులివెందులలో చెట్లు ఎండిపోతుంటే అక్కడ నీళ్ల ఇవ్వలేని జగన్, కుప్పం ప్రజలకు హంద్రీనీవా నీళ్ల సరఫరా చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ పాలనలో కుప్పం బ్రాంచి కెనాల్‌ను 87శాతం పూర్తి చేయగా, జగన్ పాలనలో 10శాతం మాత్రమే పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. యువనాయకుడు దొమ్మలపాటి యశశ్వీరాజ్ మాట్లాడుతూ రాజంపేటలో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి ఇప్పటికీ నిర్వాసితులు అవస్థలు పడుతున్నా వారిని పట్టించుకోని జగన్ కుప్పంకు వెళ్లి ప్రజల నెత్తిన నీళ్ల జల్లి నాటకాలు ఆడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, మీడియా కోఆర్డినేటర్ యర్రబెల్లి వెంకటరమణారెడ్డి, మునిరాజు, పసుపులేటి శ్రీనివాసులు, ప్రభాకర్, బావాజాన్, వేణుగోపాల్‌రెడ్డి, దేవా, అక్కులప్ప, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

● జగన్ మోసపూరిత మాటలను ప్రజలు నమ్మరని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగన్ ఎన్ని నాటకాలు ఆడినా కుప్పం ప్రజలు చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించడం ఖాయమన్నారు. సమావేశంలో అన్వర్‌బాషా, రాజన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

పీలేరులో నల్లారిని గెలిపించి.. ఉమ్మడి జెండా ఎగరేస్తాం


బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంగీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 28: రానున్న ఎన్నికల్లో పీలేరు నియోజకవర్గం నుంచి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని గెలిపించి అసెంబ్లీకి పంపడమే కాకుండా ఉమ్మడి టీడీపీ-జనసేన జెండాను ఎగరేస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని నాయక్‌వీధి, రైల్వే గేటు రోడ్డు, ఎల్ఆర్‌వీధి తదితర ప్రాంతాలలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోతో రూపొందించిన కరపత్రాలను నాయకులు, కార్యకర్తలు ఇంటింటా పంచుతూ విస్తృత ప్రచారం చేపట్టారు. వచ్చేది టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లి మధు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షులు సయ్యద్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రమేష్ నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, తెలుగు యువత చాను, సయ్యద్‌బా షా, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, ఎండీ యూసుఫ్, కువైట్ బాబు, బొక్కసం బ్రదర్స్ సాదిక్, సర్దార్, సయ్యద్ అమీర్, ఆలీ, సైదు, హనీఫ్, తోటవీధి ఫణి, బాలకృష్ణమనాయుడు, లోకేష్, నవీన్, ప్రసాద్, అరుణ్, సంతోష్, తరుణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సజావుగా నిర్వహించాలి


ఎన్నికల విధులపై శిక్షణలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

మదనపల్లె, ఫిబ్రవరి 28: వచ్చే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని స్థానిక డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పోలీసులకు సూచించారు. ఎన్నికలకు సంబంధించి నేరాలు, చట్టాలపై స్థానిక బీసెంట్ హాలులో రెండురోజులపాటు మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి రోజు బుధవారం డీఎస్పీ మాట్లాడుతూ గతంలోని అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల్లో పనిచేయాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఈ 45-50 రోజులు చాలా కీలకమని, హోంగార్డు నుంచి సీఐ వరకూ అప్రమత్తంగా వ్యవహరించాల్సిఉంటుందన్నారు. పాత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల సందర్భంగా పట్టణం, గ్రామాల్లో సమస్యాత్మ క, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎస్పీ పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, సీఐలు వలిబసు, యువరాజ్, రూరల్ సీఐ ఎన్.శేఖర్, తాలూకా సీఐ సద్గురు, బి.కొత్త కోట సీఐ సూర్యనారాయణ, ఎస్ఐలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.


నిబంధనలు పాటించని ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలేవి..?

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28: మదనపల్లె పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన ప్రైవేటు ఆస్పత్రులపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ జిల్లా వైద్యశాఖ డెమో దేవశిరోమణిని బహుజన యువసేన అధ్యక్షుడు పునిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటిలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో డెమో దేవ శిరోమణిని కలసిన పునీత్ మాట్లాడుతూ జనవరి 31న మదనపల్లెలో మూడు ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి వాటికి రిజిస్ట్రేషన్‌లు లేవని తేల్చిన అధికారులు ఇప్పటి వరకు ఈ ఆస్పత్రులపై చర్యలు తీసుకోలేదన్నారు. వాటితో పాటు 32 ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఇదే స్థితి వున్నాయని, కాని వైద్యశాఖ అధికారులు వాటిపై తనిఖీలు చేసేందుకు అలసత్వం ప్రదర్శించడం సబబు కాదన్నారు. ఆయన వెంట బీవైఎస్ నాయకులు నవీన్, సుధాకర్, శశికుమార్, సునీల్ వున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 28 : రానున్న సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని ఎలక్ట్రోర ల్ ఆఫీసర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా హంద్రీ- నీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఎలక్ట్రోరల్ ఆఫీసర్‌గా పీటీఎం మండలం లోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలిం చారు. అందులో భాగంగానే ఆయన బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులుతో కలసి మల్లెల పంచాయతీ ఉప్పరోళ్లపల్లె పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి కేంద్రంలో మరుగుదొ డ్డితో పాటు కరెంట్, మంచినీటి సౌకర్యం, కిటికీలు, తలుపులు భద్రంగా ఉన్నాయన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆర్ఐ అనిషా, స్థానిక వీఆర్వో మూర్తి, శ్రీరాములు, సలీం బాషా, మల్లిఖార్జునతో పాటు వీఆర్ఏలు ఉన్నారు.

జాయినింగ్ ది డాట్స్ శిక్షణకు 20 మంది ఎంపిక


జాయినింగ్ డాట్స్ శిక్షణకు ఎంపికైన జ్ఞానాంబిక విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 28: బెంగళూరుకు చెందిన జాయినింగ్ ది డాట్స్ సంస్థ ఏడాది పాటు ఉచితంగా ఇచ్చే శిక్షణకు మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు 20 మంది ఎంపికయ్యారని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసిన డాక్టర్ ధనుంజయ పేద విద్యార్థులు ఉత్తమ భవిష్యత్ అందించేందుకు జాయినింగ్ ది డాట్స్ సంస్థ ఏర్పాటు చేశారన్నారు. ఈ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఏడాది పాటు పైథాన్, డేటా స్ట్రక్చర్స్ అల్గరితం, ఫ్రంట్ ఎండ్ అండ్ బ్యాక్ ఎండ్, మాక్ ఇంటర్వ్యూలు, పీర్ ఇంటర్వ్యూలు, కోడింగ్ అసైన్‌మెంట్, హాకతాన్ తదితర అంశాలపై ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. 300 మందిలో ప్రతిభ చూపిన 20 మంది విద్యార్థులను శిక్షణకు ఎంపిక చేశారు. వారికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం మెడల్సును అందజేశారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రమా దేవి, అధ్యాపకుడు హేమకుమార్ అభినందించారు.

ఇలాగైతే వంట చేయలేం.. వంటగదికి తాళం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 28 : ఎనిమిది నెలల నుంచి బకాయిలు చెల్లించకుంటే వంట ఎలా చేయాలి, అది కూడా మీరు చెప్పినట్టు మెనూ ప్రకారం చేయలేదని వంట ఏజన్సీ నిర్వాహకులు వంట గదికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సంఘటన మండల కేంద్రమైన పీటీఎంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. మంగళవారం ఉదయం పాఠశాలలో మెనూ ప్రకారం పులిహోర చేయాలని ప్రధానోపాధ్యాయురాలు అపర్ణాదేవి నిర్వాహకులను ఆదేశించడంతో వంట నిర్వాహకులు మాకు 8 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తామేమి చేయలేమని కచ్చితంగా మీరు మెనూ ప్రకారం వంటలు చేయాల్సిందేనని హెచ్‌ఎం చెప్పడంతో వారు చేసేదేమీ లేక వంట గదికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. వెంటనే హెచ్‌ఎం ఎంఈవోకు ఫోన్ చేయగా స్పందించిన ఎంఈవో సర్దుబాటు చేసి ఎలాగోలా వంట చేయించి విద్యార్థులకు వడ్డించారు. ఈ విషయంపై స్పందించిన డీవైఈవో శ్రీరాం పురుషోత్తం బుధవారం పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. వంట నిర్వాహకులను, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని పిలిపించి విచారణ చేపట్టారు. ఇటువంటి సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులదేనని, ఇటువంటి సమస్యలు రాకుండా చూడాలని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆదేశించిన మేరకు మెనూ తప్పనిసరిగా పాటించి తీరాలన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు మెనూ పాటించాలని ఆయన తెలిపారు.